విలేకరులు కావలెను

పెన్ సత్తా తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 4 | సంచిక :102 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 1 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool


## కొత్త ఓటు కోసం 8.58 లక్షల


# దరఖాస్తులు



- ముగిసిన ఓటర్ల సవరణ గడువు
- రాష్ట్రంలో ముగిసిన ఓటర్ల క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ
- ఓట్ల తొలగింపు కోసం రికార్డు స్థాయిలో 48.12 లక్షల వినతులు
- మార్పులు, చేర్పుల కోసం 12.03 లక్షల దరఖాస్తుల స్వీకరణ

అమరావతి

రాష్ట్రంలో ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ కీలక దశకు చేరుకుంది. ఓటర్ల జాబితాలో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువు ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. కొత్తగా ఓటుహక్కు పొందడానికి రాష్ట్రవ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వచ్చాయి. అలాగే, అనర్హుల ఓట్ల తొలగింపునకు, మార్పులు చేర్పులకు లక్షల సంఖ్యలో వినతులు అందాయి. శనివారం సాయంత్రం వరకు అందిన దరఖాస్తుల వివరాలను ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటించింది. సెప్టెంబర్ 28 లోపు ఈ దరఖాస్తుల విచారణ పూర్తి చేస్తారు. అర్హుల పేర్లతో అక్టోబర్ 3న ఓటర్ల తుది జాబితాను విడుదల చేయనున్నారు. వివరాలు 2లో..



## ప్రతి ఒక్కరూ శాంతియుతంగా, చట్టబద్ధంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నాం

- సీజేపీ నిరసనలపై నిషేధానికి సుప్రీం నిరాకరణ
- సెప్టెంబర్ 5న కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన నిరసనలపై నిషేధం కోరుతూ దాఖలైన పిటిషన్ విచారణకు సుప్రీం నిరాకరణ
- ప్రతిఒక్కరూ శాంతియుతంగా, చట్టబద్ధంగా ప్రవర్తిస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడి
- విద్యార్థుల నిరసనలకు సంబంధించిన ఇతర విషయాలతో పాటు ఈ పిటిషన్‌ను కూడా సెప్టెంబర్ 10కి వాయిదా

# వెలిగొండ బంగారు కొండ

- వెలిగొండ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలిపిన సీఎం చంద్రబాబు
- నిమ్మల రామానాయుడిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నానన్న సీఎం
- నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది తన ఆకాంక్ష అన్న చంద్రబాబు
- 'వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం
- బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం
- పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలనూ చూశాం



వెలిగొండ

వెలిగొండ బంగారు కొండ అవుతుందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మాట ఇచ్చి నిలబెట్టుకున్నామని, ప్రాజెక్టు పూర్తి చేశామని చెప్పారు. కృష్ణమ్మ తెచ్చామని, కరవును తరిమికొడుతున్నామని తెలిపారు. '30 ఏళ్లకు మునుపు చంద్రబాబు అనే నేను 1996 మార్చిన భూమిపూజ చేశా, 30 సంవత్సరాల తర్వాత మొదటి దశ ప్రారంభించి జాతికి అంకితం చేశానని స్పష్టం చేశారు. వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు పాల్గొని మాట్లాడారు.

2019లో గొడ్డలి పార్టీ రాకతో వెలిగొండ ప్రాజెక్టుకు గ్రహణం పట్టిందని చంద్రబాబు విమర్శించారు. 2024లో వెలిగొండకు పట్టిన గ్రహణం వీడిందన్నారు. గత ప్రభుత్వంలో కేవలం వివరాలు 2లో..



## నౌకాదళంలోకి మరో స్వదేశీ అస్త్రం

- ఏకంగా 300 మీటర్ల లోతులో సైతం ఆపరేషన్లు
- ఇండియన్ నేవీలోకి అధికారికంగా చేరిన నిపుణ్ డైవింగ్ సపోర్ట్ వెస్సెల్
- సముద్ర గర్భంలో క్లిష్టమైన ఆపరేషన్లకు పెరిగిన బలం
- సబ్‌మెరైన్ రెస్క్యూలోనూ కీలకం
- హిందూ మహాసముద్ర ప్రాంతంలో పెరిగిన నేవీ సామర్థ్యం

## దేశంలో మళ్లీ వరుణుడి బీభత్సం



- తెలుగు రాష్ట్రాలకు వర్షాల హెచ్చరిక
- ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 5 వరకు పలు రాష్ట్రాల్లో వర్షాలు
- బంగాళాఖాతంలో అల్పపీడనం, చురుగ్గా నైరుతి రుతుపవనాలు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని ఐఎండీ హెచ్చరిక

## రక్షణ రంగంలో విదేశీ పెట్టుబడులు




- నిబంధనలు సడలించే యోచనలో కేంద్ర ప్రభుత్వం!
- త్వరలో రక్షణ రంగంలోనూ విదేశీ పెట్టుబడుల ప్రవాహం
- నిబంధనల్ని సడలించే యోచనలో కేంద్రం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం
- 2029 నాటికి రక్షణ ఉత్పత్తుల విలువ రూ. 3 లక్షల కోట్లను చేరుకోవడమే లక్ష్యం!



## మలేరియాపై భారత్ భారీ విజయం

- 10 ఏళ్లలో 80 శాతం తగ్గిన కేసులు..
- పదేళ్లలో 80 శాతం తగ్గిన మలేరియా కేసులు
- 80 శాతం తగ్గిన మలేరియా మరణాలు
- 155 నుంచి 33కు తగ్గిన సమస్యాత్మక జిల్లాలు
- 160 జిల్లాల్లో నమోదు కాని స్థానిక కేసులు
- 33 జిల్లాల్లోనే 64 శాతం కేసులు నమోదు

## పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను

# తప్పక పాటించాలి



- ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు
- కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్
- రాష్ట్రంలో పరిశ్రమలన్నీ 33 శాతం పచ్చదనాన్ని పాటించాలి
- రాష్ట్రంలో అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలన్న పవన్
- రాష్ట్ర ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని వ్యాఖ్య

అమరావతి

ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణశాఖల మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాలన్నారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త దీనిని ఒక సామాజిక బాధ్యతగా స్వీకరించి ముందుకు తీసుకెళ్లాలని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అన్ని రకాల పరిశ్రమలు 33 శాతం పచ్చదనం నిబంధనను కచ్చితంగా అమలు చేసేలా కాలుష్య నియంత్రణ మండలి, ఏపీ-గ్రీన్ సంస్థలు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ ఆదేశించారు. 2026 గణాంకాల ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా పోర్టులు, సిమెంట్, మైనింగ్, ఎనర్జీ, ఆహార శుద్ధి, ప్లాస్టిక్, పేపర్, వస్త్రాలు తదితర రంగాలకు చెందిన సుమారు 3,400 పరిశ్రమలు, కంపెనీలు వేలాది ఎకరాల విస్తీర్ణంలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని ఆయన చెప్పారు.

ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో 14 రోజుల ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామని పవన్ కల్యాణ్ వివరించారు. తొలి విడతగా పైలట్ ప్రాజెక్టు కింద ఏపీ వ్యాప్తంగా 26 పరిశ్రమల్లో 129 ఎకరాల విస్తీర్ణంలో పచ్చదనం పెంపొందించే వివరాలు 2లో..



## నకిలీ ప్రారంభోత్సవాలు వైఎస్సార్సీపీకే సొంతం

- వెలిగొండ తన ఘనతంటూ జగన్ పోస్టు
- 2024లోనే గత ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభించిన వీడియో
- నీళ్లు లేని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం ఏంటని ఎద్దేవా చేసిన లోకేశ్

అమరావతి

వెలిగొండ తన ఘనతంటూ జగన్ చేసిన పోస్టుకు మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 2024లో నీళ్లు లేకుండానే వెలిగొండ ప్రాజెక్టును జగన్ ప్రారంభించారని ఎద్దేవా చేశారు. జగన్ పోస్టులోని విజువల్స్‌ను నిశితంగా పరిశీలిస్తే అసలు విషయం అర్థమవుతుందని, నీరు లేని ప్రాజెక్టుకు ప్రారంభోత్సవం చేసి చరిత్ర సృష్టించారని విమర్శించారు. ఇది నకిలీ ప్రారంభోత్సవమని, ఇలాంటి ఘనత వైఎస్సార్సీపీకి మాత్రమే దక్కుతుందని లోకేశ్ సోషల్ మీడియా వేదికగా దుయ్యబట్టారు. వెలిగొండ ప్రాజెక్ట్ విషయంలో వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ఎదురుదాడి చేశారు. ఈ ప్రాజెక్ట్ ఘనతను వివరాలు 2లో..

# వెలిగొండ బంగారు కొండ

-మొదటిపేజీ తరువాయి

2.77 శాతమే పనులు చేశారన్నారు. నిర్వాసితుల కోసం జీవో ఇచ్చి అరకొర చెల్లింపులతో మోసం చేశారని మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసినట్లు డ్రామాలాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫేక్ ప్రచారాలతో కరవు రైతుల జీవితాలతో ఆడుకున్నవారిని ఏమనాలని చంద్రబాబు ప్రశ్నించారు.

2024 ఎన్నికల్లో మోదీ, పవన్, తాను కలిసి రాష్ట్ర పునర్నిర్మాణంపై మాట ఇచ్చామని చంద్రబాబు గుర్తు చేశారు. తమపై విశ్వాసం ఉంచి ఎన్నికల్లో తిరుగులేని ఆధిక్యమిచ్చారని చెప్పారు. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్ల ఏపీకి అన్నీ ప్రయోజనాలేనని తెలిపారు. మోదీ సహాయం మిత్రుడు పవన్ సహకారంతో ముందుకెళ్తున్నామన్నారు. కరవుతో పోరాడిన రైతన్నకు కృష్ణా జలాలతో స్వాగతం పలికామని చంద్రబాబు వెల్లడించారు.

'వాన కోసం ఆకాశం వైపు చూసిన రైతుల బాధలు చూశాం. బోరు వేస్తే నీళ్లు పడక అప్పుల్లో కూరుకుపోయిన కుటుంబాలను చూశాం. పనులు దొరక్క ఊరు విడిచి వెళ్లిన కూలీలనూ చూశాం. ఇక ఆ పరిస్థితులు ఉండవు ఫ్లోరైడ్ అనే పదం మరచిపోతాం. వెలిగొండ ప్రాజెక్టుకు భూములు త్యాగం చేసిన ప్రజలకు పాదాభివందనం చేస్తున్నా. కరవుపై గెలవాలన్న సంకల్పంతో ముందడుగు వేశాం. వెలిగొండ అంటే ఫ్లోరైడ్ కష్టానికి ముగింపు. కరవు నేలపై కృష్ణమ్మ రాసిన కొత్త చరిత్రని' చంద్రబాబు వ్యాఖ్యానించారు.

"నాడు చేసిన సంకల్పం నేడు నల్లమల సాగర్‌లో జలసిరిగా మారింది. నాడు వేసిన పునాదిరాయి నేడు కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టింది. ఇది భగీరథ ప్రయత్నం కొండలు వస్తే తొలచి ముందుకెళ్లాం. ఎదురైన ప్రతి సవాల్‌ను అధిగమించి ముందుకెళ్లాం. వెలిగొండ కోసం పనిచేసిన ప్రతిఒక్కరికీ అభినందనలు. నిమ్మల రామానాయుడిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. నిర్వాసితులు కూడా సంతోషంగా ఉండాలనేది నా ఆకాంక్ష. ఆర్థికంగా కష్టాలున్నా ఎక్కడా వెనుకడుగు వేయలేదు.చేతగాకపోతే తప్పు లేదు చేశామని మోసం చేస్తేనే పెద్ద తప్పు. ఫేక్ మాటలు చెప్పేవారిని నిలదీయకపోతే అవే వాస్తవాలు అనుకుంటారు. ఆవేదనతో చెబుతున్నా ఫేక్ మాటలను సమర్థంగా తిప్పికొట్టాలి." - చంద్రబాబు, ముఖ్యమంత్రి



'శ్రీశైలం ప్రాజెక్టులోని కొల్లం వాగు నుంచి నీటిని గ్రావిటీ ద్వారా తెస్తున్నాం. 53 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునే అవకాశం కలుగుతుంది. రూ.10,200 కోట్ల ప్రాజెక్టు వ్యయంలో రూ.7,983 కోట్లతో మొదటి దశ పూర్తిచేశాం. 18.8 కిలోమీటర్ల మేర జంట సొరంగాలు, 21.8 కిలోమీటర్ల ఫీడర్ కాల్వల పనులు పూర్తిచేశాం. 48 రోజుల్లోనే 6,206 నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్లు పరిహారం అందించాం. ఆర్థికంగా కష్టాలున్నా మీ బాధలు గుర్తించి అదనంగా మరో రూ.169 కోట్లు చెల్లిస్తున్నాం. కటాఫ్ డేట్ పెంచి 18 ఏళ్లు నిండిన యువత ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున ఇస్తున్నామని' చంద్రబాబు తెలిపారు.


నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి కుళాయి ద్వారా నీరిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. సెప్టెంబర్‌లో లక్ష కోట్ల గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టులో మార్కాపురాన్ని భాగం చేశామన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతం పొరుగు జిల్లాలకు పోటీగా నిలుస్తుందని చెప్పారు. వెలిగొండ తొలి దశతో ఆగము ఫేజ్ 2 కూడా 2028కి పూర్తి చేస్తాం. 2047 స్వర్ణాంధ్రకు అందరూ సిద్ధమని సంకల్పించాలని చంద్రబాబు పేర్కొన్నారు.

'నీటి సమస్యకు ఏకైక పరిష్కార మార్గం నదుల అనుసంధానం. నదుల అనుసంధానం జరగాలంటే ప్రధాని మోదీకే సాధ్యం. పోలవరం రాష్ట్రానికే జీవనాడి. పోలవరాన్ని 2027 మార్చికి పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. రాబోయే కృష్ణా పురస్కారాలను మార్కాపురంలో కూడా జరుపుకోబోతున్నాం. గోదావరి నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నాయి. వృథాగా వెళ్లే నీటిని దారిమళ్లిస్తే ప్రజలకు సంపద సృష్టించొచ్చు. గోదావరి నీళ్లు కూడా నల్లమల సాగర్‌కు రావాలి. బుధవారం నాడు పోలవరం ఎడమ కాల్వ ద్వారా గోదావరి జలాలను అనకాపల్లికి తీసుకెళ్తున్నాం. ఉత్తర భారత్‌లో నదుల అనుసంధానానికి అనేక సమస్యలు పరిష్కరించారు. దక్షిణ భారత్‌లో కూడా గోదావరి, కావేరి అనుసంధానం చేయాలి. నదుల అనుసంధానంతో దేశం సుభిక్షంగా ఉంటుందని' చంద్రబాబు స్పష్టం చేశారు.

"నాకు రాజకీయం అంటే ఎన్నికలు కాదు. ప్రజల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావడం. ఓట్ల ఆశించి కాదు మార్పు ఆశించి పనిచేస్తా. నెక్స్ట్ ఎన్నికల కోసం కాదు నెక్స్ట్ జనరేషన్ కోసం పనిచేస్తా. నా ఊపిరి ఉన్నంతవరకు తెలుగు జాతి కోసం కష్టపడతా. అందరం కలిసి తెలుగుజాతిని ప్రపంచంలోనే నెంబర్ వన్ చేద్దాం." - చంద్రబాబు, ముఖ్యమంత్రి

# వైసీపీలో 'సజ్జల-బొత్స' కల్లోలం!

**గుంటూరు :** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీపై బాంబు వేశారు విజయసాయిరెడ్డి. తనను నమ్మకద్రోహి అంటూ విమర్శించడానికి తట్టుకోలేక 2 పేజీల బహిరంగ లేఖను విడుదల చేశారు. ప్రధానంగా సజ్జల రామకృష్ణారెడ్డిని టార్గెట్ చేసుకున్నారు. ఆయనకంటే ఇంకా నమ్మకద్రోహి ఎవరు ఉంటారు అంటూ.. పార్టీలో తనకు జరిగిన అన్యాయాన్ని, అవమానాలను ఏకరువు పెడుతూ తన ఆవేదనను బయటపెట్టారు. అయితే మధ్యలో ఉత్తరాంధ్రకు చెందిన మాజీ మంత్రి అంటూ పరోక్షంగా బొత్స సత్యనారాయణ ప్రస్తావన తీసుకొచ్చారు. త్వరలో పార్టీ మారబోతున్న ఓ మాజీ మంత్రి అంటూ అభివర్ణించారు. బొత్సతో కలిసి సజ్జల రామకృష్ణారెడ్డి తనపై కుట్ర చేసి.. ఉత్తరాంధ్ర సమన్వయకర్త పదవి నుంచి తొలగించారని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడు రెండు విషయాల్లో క్లారిటీ ఇచ్చారు విజయసాయిరెడ్డి. సజ్జల రామకృష్ణారెడ్డి టిడిపి కోవర్టుగా పనిచేస్తున్నారని ఒకవైపు.. బొత్స సత్యనారాయణ పార్టీ మారబోతున్నారు అని క్లారిటీ ఇచ్చారు. ఈ రెండు అంశాలు ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఆందోళన నింపుతున్నాయి.విజయసాయిరెడ్డి లాజిక్ తో కొట్టారు. నమ్మకద్రోహి అయి ఉంటే నాడు కాంగ్రెస్ పార్టీతో రాజీ పడే వాడినని.. జగన్మోహన్ రెడ్డితో కేసులు పడేవాడిని కాదు అంటూ.. పార్టీ ఏర్పాటుకు ముందు నుంచే తాను జగన్మోహన్ రెడ్డికి నమ్మిన బంటు అని చెప్పే ప్రయత్నం చేశారు. మరోవైపు కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత సజ్జల రామకృష్ణారెడ్డి పై ఒక్క ఛార్జ్ షీట్ దాఖలు కాని విషయాన్ని ప్రస్తావించి.. టిడిపి తో కుమ్మక్కు అయ్యారని చెప్పేందుకు ఇంతకంటే మంచి ఉదాహరణ ఏముంటుందని చెప్పే ప్రయత్నం చేశారు. దానిపై కూడా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఆలోచన మొదలైంది. సజ్జల రామకృష్ణారెడ్డి తీరు వల్ల పార్టీకి డ్యామేజ్ జరుగుతుందనే క్యాడర్ అభిప్రాయానికి మరింత బలం చేకూరింది.మరోవైపు బొత్స సత్యనారాయణ పార్టీ మారే అవకాశం ఉన్నట్లు ఇటీవల ప్రచారం నడిచింది. కుటుంబ అవసరాల రిత్యా ఆయన జనసేనలో చేరుతారన్న టాక్ కూడా ఉంది. కానీ ఇంతవరకు ఆ ప్రచారాన్ని ఖండించలేదు బొత్స. ఇప్పుడు విజయసాయిరెడ్డి ఆ ప్రస్తావన తీసుకొచ్చేసరికి ప్రాథమికంగా ఏదో జరిగిందన్న అనుమానం ఉంది. అయితే బొత్స కు జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన ప్రాధాన్యత దృష్ట్యా ఆయన పార్టీకి గుడ్ బై చెప్పారని మెజారిటీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. ఉత్త ప్రచారం అని తేల్చేసాయి. కానీ ఇప్పుడు విజయసాయిరెడ్డి బొత్స విషయంలో బాంబు పేల్చారు. ఆయన పార్టీ మారబోతున్నట్లు ప్రస్తావన తీసుకొచ్చారు. ఒకవైపు సజ్జల టిడిపి కోవర్టుగా పనిచేస్తున్నారని ఒకవైపు.. బొత్స పార్టీ మారబోతున్నారన్న విషయం ఒక వైపు.. వైసీపీలో కల్లోలం రేపుతోంది.



**సజ్జల నన్ను కొట్టాడు**

సోనియా గాంధీని ఎదిరించి పార్టీ పెట్టిన తర్వాత.. వైయస్ జగన్మోహన్ రెడ్డికి అన్ని తనై నడిపించారు విజయసాయిరెడ్డి. జగన్ కంపెనీలలోకి ప్రవహించిన పెట్టుబడులు.. ఆయన స్థాపించిన సంస్థలు.. సంపాదించిన ఆస్తులు.. వీటన్నిటిని పర్యవేక్షించారు విజయసాయిరెడ్డి. అప్పట్లో కేంద్ర దర్యాప్తు సంస్థలు కేసులు పెట్టినప్పుడు.. కేంద్ర దర్యాప్తు సంస్థలకు దొరకకుండా జగన్ స్థాపించిన కంపెనీల వ్యవహారాలను.. లోగోట్టును బయటపడకుండా చూశారు విజయసాయిరెడ్డి. 2019 ఎన్నికల్లో జగన్ గెలవడంలో షర్మిల ఎంతైతే పాత్ర పోషించారు.. అంతకుమించిన స్థాయి పాత్రను విజయసాయిరెడ్డి పోషించారు. నాడు రాజ్యసభ సభ్యుడిగా విజయ సాయి రెడ్డి ఉండేవారు. ఎప్పుడైతే సజ్జల రామకృష్ణారెడ్డి జగన్ కోటరీలో చేరిపోయారో అప్పుడే పరిస్థితి మారిపోయింది. విజయసాయి రెడ్డి ప్రభ మసకబారడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలోనే విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో భౌతిక దాడికి గురయ్యారు. ఆ సమయంలో జగన్ పక్కనే ఉన్నప్పటికీ కనీసం మాట కూడా మాట్లాడలేదు. దీనికి తోడు అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని తప్పించారు. దీంతో తట్టుకోలేక విజయసాయిరెడ్డి బయటికి వచ్చేసారు. పార్టీ ద్వారా సంక్రమించిన రాజ్యసభ సభ్యత్వాన్ని కూడా వదులుకున్నారు.పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత విజయసాయిరెడ్డి అసలు విషయాలను బయటపెడుతున్నారు.. మద్యం కుంభకోణం.. ఇతర అక్రమాలను ఆయన మీడియా ముందు ఉంచుతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా విజయసాయిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. నాడు పార్టీలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను.. అవమానాలను ఆయన బయటపెట్టారు. 2022లో వైసీపీ ప్లీనరీలో అందరి ముందు విజయసాయి రెడ్డి పై సజ్జల రామకృష్ణారెడ్డి భౌతిక దాడి చేశారు. నాడు జగన్ ప్రత్యేక పాత్రకే పరిమితమయ్యారని విజయసాయిరెడ్డి ఆరోపించారు. అన్ని బాధ్యతల నుంచి విజయసాయిరెడ్డిని జగన్ తప్పించారు. అంతేకాదు నాటి సజ్జల కేవలం ఎమ్మెల్యేలు ఎంపీలకు మాత్రమే కాకుండా మంత్రులకు కూడా జగన్ అపాయింట్మెంట్ లభించకుండా చేశారట. అందువల్లే వైసీపీ ఓడిపోయిందట. ఇప్పుడు టిడిపి కూటమితో సజ్జల రాజీ పడ్డారట. అందువల్లే నమోదైన కేసులలో ఆయన పేరు మీద చార్జిషీట్ ఏర్పాటు చేయలేదట. అంతేకాదు సజ్జల వల్ల జగన్ తన కుటుంబానికి దూరమయ్యారట. ఒకవేళ 2029 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డికి ఓటమి ఎదురైతే అది ముమ్మాటికి సజ్జల వల్లేనని విజయసాయి రెడ్డి ఆరోపించారు. మొత్తానికి విజయసాయిరెడ్డి మరోసారి వైసీపీలో ఉన్న అసలు వ్యవహారాలను బయట పెట్టడంతో.. ఇప్పుడు ఆ పార్టీ నేతలకు మాట్లాడే అవకాశం లేకుండా పోతుంది. సరిగా స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు వైసీపీలో జరుగుతున్న వ్యవహారాలను విజయసాయిరెడ్డి బయట పెట్టడంతో.. ఆ పార్టీకి ఉక్కపోత ఎదురవుతోంది.

## జొన్నగిరిలో వజ్రాల వేట

**కర్నూలు :** కర్నూలు జిల్లాలోని జొన్నగిరి ప్రాంతం వజ్రాల వేటకు ప్రసిద్ధి. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఇక్కడి ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారు వజ్రాల కోసం పొలాలు, పరిసర ప్రాంతాల్లో వెతుకులాట ప్రారంభిస్తారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసిన తర్వాత నేలపైకి కొట్టుకొచ్చే రాళ్లు, ఖనిజాల్లో వజ్రాలు దొరికే అవకాశం ఉందన్న నమ్మకంతో చాలామంది ఈ వేటకు వస్తుంటారు.జొన్నగిరి ప్రాంతంలో వర్షం కురిసిన తర్వాత పొలాల్లోని మట్టి కొట్టుకుపోయి, భూమి లోపలి పొరల్లో ఉన్న రాళ్లు బయటపడతాయి. దీంతో వజ్రాల కోసం వెతికేవారికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని స్థానికులు చెబుతుంటారు. వర్షం తగ్గిన వెంటనే కొందరు స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పొలాల్లోకి వెళ్లి నేలను జల్లెడ పడతారు. మెరుస్తున్న రాళ్లు కనిపిస్తే వాటిని సేకరించి పరీక్షించుకుంటారు. జొన్నగిరి ప్రాంతంలో గతంలో వజ్రాలు లభించాయన్న వార్తలు తరచూ వెలువడ్డాయి. కొందరికి విలువైన రాళ్లు దొరికాయని ప్రచారం జరగడంతో వర్షాకాలంలో వజ్రాల వేటపై ఆసక్తి మరింత పెరుగుతోంది. అయితే ప్రతి మెరిసే రాయి వజ్రం కాదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కనిపించే కొన్ని ఖనిజాలు కూడా వజ్రాల మాదిరిగా మెరుస్తుంటాయి. నిజంగా వజ్రమా కాదా అనేది నిపుణుల పరీక్షల ద్వారానే నిర్ధారించాల్సి ఉంటుంది.వజ్రం దొరికితే ఒక్కసారిగా తమ జీవితాలు మారిపోతాయన్న ఆశతో కొందరు వర్షం పడిన ప్రతిసారీ పొలాల్లోకి వెళ్తుంటారు. గంటల తరబడి నేలను పరిశీలిస్తూ రాళ్లను ఏరుకుంటారు. వర్షాకాలంలో జొన్నగిరి ప్రాంతంలో కనిపించే ఈ దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే వజ్రాల వేటకు వెళ్లేవారు స్థానిక నిబంధనలు, భూమి యజమానుల అనుమతులు, భద్రతా అంశాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

## కొత్త ఓటు కోసం 8.58 లక్షల దరఖాస్తులు

-మొదటిపేజీ తరువాయి

కొత్తగా ఓటుహక్కు కోసం (ఫాం-6) రాష్ట్రంలో 8,58,455 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఓటర్ల ముసాయిదా జాబితా జులై 31న విడుదలైంది. ఆ జాబితా రాకముందు 6,56,732 మంది దరఖాస్తు చేశారు. ముసాయిదా విడుదలైన తర్వాత మరో 2,01,723 మంది అప్లై చేసుకున్నారు. ఈ మొత్తం దరఖాస్తుల్లో ఇంకా 2,96,063 దరఖాస్తుల విచారణ పెండింగ్‌లో ఉంది. త్వరలోనే వీటి విచారణ పూర్తి చేసి అర్హులైన వారందరి పేర్లను తుది జాబితాలో చేరుస్తారు.

**తొలగింపు కోసం 48 లక్షల దరఖాస్తులు**

ఓటర్ల జాబితా నుంచి అనర్హుల పేర్లను తొలగించడానికి (ఫాం-7) రికార్డు స్థాయిలో వినతులు వచ్చాయి. ఏకంగా 48,12,704 దరఖాస్తులు ఎన్నికల సంఘానికి అందాయి. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు, ఆ చిరునామాలో లేని వారు, డబుల్ ఎంట్రీ ఉన్న ఓట్లను తొలగించాలని ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ముసాయిదా జాబితా విడుదలకు ముందే 47,97,295 దరఖాస్తులు వచ్చాయి. విడుదల తర్వాత 15,409 దరఖాస్తులు మాత్రమే అందాయి. ముసాయిదా విడుదలకు ముందు వచ్చిన దరఖాస్తుల్లో 4,038 మినహా, మిగతా వాటన్నింటి విచారణను అధికారులు పూర్తి చేశారు. అనర్హుల పేర్లు తొలగించాకే ముసాయిదా జాబితాను విడుదల చేశారు. ప్రస్తుతం 7,118 దరఖాస్తుల విచారణ మాత్రమే పెండింగ్‌లో ఉంది.

**మార్పులు, చేర్పులకు 12 లక్షలు**

ఓటర్ల జాబితాలో తప్పుల సవరణ, మార్పులు చేర్పుల కోసం (ఫాం-8) 12,03,045 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఒకే నియోజకవర్గంలో చిరునామా మార్పు, వేరే నియోజకవర్గానికి ఓటు బదిలీ, పేర్లలో తప్పులు, ఫోన్ నంబర్ల సవరణ కోసం వీరు దరఖాస్తులు పెట్టుకున్నారు. ముసాయిదా జాబితా విడుదలకు ముందు 10,69,218 మంది దరఖాస్తు చేసుకోగా విడుదల తర్వాత 1,33,827 మంది దరఖాస్తు చేశారు. ప్రస్తుతం వీటిలో 1,86,365 దరఖాస్తుల విచారణ పెండింగ్‌లో ఉంది. గడువు ముగియడంతో ఇకపై వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తుది జాబితాను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

## పరిశ్రమలన్నీ పర్యావరణ నిబంధనలను తప్పక పాటించాలి

-మొదటిపేజీ తరువాయి

కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఉన్న అన్ని పరిశ్రమలు 33 శాతం పచ్చదనం లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50 శాతం పచ్చదనాన్ని సాధించాలన్న మహత్తర సంకల్పంలో పారిశ్రామిక వర్గాలు చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## నకిలీ ప్రారంభోత్సవాలు వైఎస్సార్సీపీకే సొంతం

-మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "కాజేయడానికి" ప్రయత్నిస్తున్నారని జగన్ 'ఎక్స్' వేదికగా ఆరోపించడంతో ఈ రాజకీయ వివాదం ముదిరింది. 1996లో చంద్రబాబు కేవలం శంకుస్థాపన మాత్రమే చేశారని, కానీ దీని వెనుక ఉన్న అసలు దార్శనికత వైఎస్ రాజశేఖర రెడ్డిదేనని, అలాగే కీలకమైన జంట సొరంగ మార్గాల నిర్మాణం వైఎస్సార్సీపీ హయాంలోనే పూర్తయిందని జగన్ పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన ట్రయల్ రన్, సంబరాలను ఆయన కేవలం "ప్రచార ఆర్భాటాలు"గా కొట్టిపారేశారు.



నారా లోకేశ్ ఎదురుదాడి

జగన్ ఆరోపణలకు 'ఎక్స్' వేదికగా నేరుగా స్పందించిన నారా లోకేశ్, మాజీ ముఖ్యమంత్రి తన హయాంలో "నకిలీ ప్రారంభోత్సవం" చేశారని ఎండగట్టారు. "నీళ్లు లేని ప్రారంభోత్సవం"పై ఎద్దేవా చేశారు. 2024 నాటి దృశ్యాలను నిశితంగా గమనించాలని ప్రజలను లోకేశ్ కోరారు. "2024లో జగన్ చరిత్ర సృష్టించారు. నీళ్లు లేని సాగునీటి ప్రాజెక్టును ప్రారంభించారు. ఒక నకిలీ ప్రారంభోత్సవం - ఇది కేవలం వైఎస్సార్సీపీకే సాధ్యం". తన స్పందనతో పాటు కొన్ని హ్యాష్‌ట్యాగ్‌లను కూడా పోస్టు కింద జత చేశారు. అందులో 'ఫేక్ జగన్', 'డ్రీమ్ వెలిగొండ ప్రాజెక్ట్' వంటివి ఉన్నాయి. ఇవి ప్రస్తుతం సామాజిక మాధ్యమాలలో ట్రెండింగ్‌గా మారాయి.

30 ఏళ్ల కల సాకారం

దశాబ్దాల నిరీక్షణ తర్వాత టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం హయాంలో వెలిగొండ సొరంగం గుండా కృష్ణా జలాలు మొదటిసారిగా ప్రవహించాయని లోకేశ్? నొక్కి చెప్పారు. కరువు పీడిత ప్రాంతానికి ఇది చారిత్రాత్మక జీవనాడి అని ఆయన అభివర్ణించారు. వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం అనేది కేవలం రాజకీయ అంశం మాత్రమే కాదని, ప్రస్తుత ప్రభుత్వ దృఢమైన విధానమని ఆయన స్పష్టం చేశారు.

## ఏపీలో స్థానిక ఎన్నికలు.. చంద్రబాబు బాటలో జగన్!

**కడప :** వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అటువంటి చోట నియోజకవర్గ ఇన్చార్జి లకు టికెట్లు ఇవ్వనని తేల్చి చెప్పారు. కానీ ఈ ప్రకటన వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. కచ్చితంగా ఈ ప్రకటనతో తెలుగుదేశం కూటమి ముందుగానే పావులు కదుపుతుంది. ముందుగా పులివెందుల నియోజకవర్గం పైనే ఫోకస్ పెడుతుంది. గత ఏడాది పులివెందుల జడ్పిటిసి స్థానం ఏ విధంగా పట్టుబట్టి గెలిచిందో.. కచ్చితంగా పులివెందుల మునిసిపాలిటీని సైతం అలాగే కైవసం చేసుకుంటుంది. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో ఒకరు మున్సిపల్ అభ్యర్థిగా వైసీపీ తరఫున బరిలో నిలుస్తారు. కానీ ఆ పార్టీకి కౌన్సిలర్ల అభ్యర్థులు మాత్రం దొరకరు. అంతలా ఉంటుంది టిడిపి వేట అక్కడ. ఇప్పటికే టిడిపి బృందం ఒకటి పులివెందులలో వాలిపోయింది. వారు వార్డుల్లో ఏకగ్రీవాలకు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయిపులివెందులలో ఏకగ్రీవాలు జరిగితే మాత్రం జగన్మోహన్ రెడ్డి నుంచి మరో ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఏకపక్షంగా గెలిచి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థానం దక్కకపోతే మాత్రం జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా డిఫెన్స్ లో పడతారు. అయితే కీలక కూటమి నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో చాలా మున్సిపాలిటీలు ఏకగ్రీవాలు జరుగుతాయి. అది జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసు. ఒకవేళ ఏకగ్రీవాలు జరిగి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఎదురైతే.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తారు. ఇది జరిగే పని అంటూ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు.2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ముందుగా పంచాయితీల ఎన్నికలు జరిగాయి. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. కుప్పం నియోజకవర్గంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం మోహరించింది. ఎలాగైనా మున్సిపాలిటీ ని కైవసం చేసుకోవాలని చూసింది. అయినా సరే టిడిపి శ్రేణులు ప్రతిఘటించాయి. కానీ ఫలితం లేకపోయింది. పరిమిత వార్డులకే టిడిపి పరిమితం అయింది. అంతకుముందు పంచాయతీ ఎన్నికల్లో సైతం ప్రలోభాలతో, భయపెట్టి మరి వైసీపీ సానుభూతిపరులు గెలిచారు. కేవలం కుప్పం ఫలితాలతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. అందుకే తరువాత వచ్చిన మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. ఇప్పుడు కూడా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి అదే పరిస్థితి ఎదురైన మరుక్షణం.. తరువాత ఆ రెండు స్థానిక ఎన్నికలను జగన్మోహన్ రెడ్డి బహిష్కరిస్తారు. ఇది ఒక వ్యూహం అని తెలుస్తోంది. స్థానిక ఎన్నికలు బహిష్కరించిన చంద్రబాబు స్ట్రాటజీ అప్పట్లో చాలా విమర్శలకు తావిచ్చింది. కానీ సార్వత్రిక ఎన్నికల నాటికి ఆ ప్రయోగమే ఫలించింది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సైతం అదే ఫార్ములాను అనుసరించనున్నారు.

# ఆహారపు అలవాట్లను పాటిస్తే సంపూర్ణఆరోగ్యం

**నక్కపల్లి,పెన్ సత్తా ఆగస్టు 31 :** మారుతున్న వాతావరణ పరిస్థితులతో ఆహారపు అలవాటులను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వేంపాడు ఆయుర్వేద డాక్టర్ కె రఘు తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పిల్లల నుంచి పెద్దల వరకూ ఆహారపు అలవాట్లలో మార్పు చేసుకోవాలని, పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. మండలం లోని బంగారమ్మపేట గ్రామంలో సోమవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పిల్లలకు కూల్ డ్రింకులు, పిజ్జాలు, ఇతర ఫాస్ట్ ఫుడ్స్ పెట్టకూడదని వివరించారు. ఆహారపు పదార్థాలపై ఈగలు, దోమలు ముసరకుండా మూతలు పెట్టాలని, వారానికి ఒక రోజు వాటర్ ట్యాంకులు, టిన్లను శుభ్రం చేసి డ్రై డేగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో 142 మందికి బీపీ,షుగర్ ఇతర వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆయుర్వేద వైద్య సేవలు వాటి ఉపయోగలను వివరించారు. కార్యక్రమంలో సీనియర్ ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్లు డీఎస్ వీ సాయి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# విద్యా రంగానికి మణికుమార్ సేవలు ఎనలేనివి



పదవీవిరమణ ఉపాధ్యాయునికి ఘన సన్మానం

**నక్కపల్లి, పెన్ సత్తా ఆగస్టు 31:** విద్యారంగంలో ఉపాధ్యాయుడు మణికుమార్ సేవలు ఎనలేనివని పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. జిల్లాపరిషత్ బాలికోన్నతపాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న వుచ్చుల మణికుమార్ పదవి విరమణ కార్యక్రమానికి అయిన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సోమవారం హెచ్.ఎమ్. వి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మూడుదశాబ్దాలకు పైగా సుదీర్ఘ సేవలందించిన మణికుమార్ తన సేవాకాలంలో నిజాయితీ,అంకితభావం, క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచారన్నారు. విద్యార్థులపట్ల,తోటి ఉద్యోగులపట్ల,ఎంతో ఆప్యాయత,గౌరవంతో మెలిగి ఇంతటి ఘన సత్కారం పొందడం ఒక అదృష్టం అన్నారు. అనంతరం గ్రామపెద్దలు, కోసూరి శ్రీను, కె వి సత్యనారాయణ పాఠశాల విద్యాకమిటీ చైర్మన్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ,ప్రధానోపాధ్యాయుడు గొట్టేటి రవి సహచర ఉద్యోగులు,పూర్వవిద్యార్థులు ,కుటుంబ సభ్యులు పాల్గొని మణికుమార్ ను ఘనంగా సత్కరించారు.

# నియోజకవర్గ సమస్యలపై ముఖ్యమంత్రి కి బహిరంగ లేఖ

సిపిఎం పార్టీ నాయకులు

**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 31:** పాయకరావుపేట నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీల నాయకులు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా నక్కపల్లి సిపిఎం పార్టీ కార్యాలయంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మాట్లాడుతూ

సెప్టెంబర్ 2న అనకాపల్లి జిల్లా , పాయకరావుపేట వద్ద పోలవరం ఎడమ కాలువ ద్వారా నీరు విడుదల చేసే జలహారతి కార్యక్రమంలో పాల్గోవడానికి వస్తున్న సందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గం లో ప్రధాన మైన సమస్యలు మీ దృష్టికి తీసుకు వస్తున్నామని తెలిపారు.

(1). తాండవ, ఏటి కొప్పాక షుగర్ ఫ్యాక్టరీల భూములు ఏపిఐఐసి కి అమ్మే నిర్ణయం వెనుకకు తీసుకోవాలని, వెంటనే షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించి,ఆధునికరించి నడిపించాలని, ప్రస్తుతం కార్మికుల జీతాల బకాయిలు, పిఎఫ్,ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

(2). తాండవ, వరహా నదులకు ఇరువైపులా పటిష్టమైన గట్లు నిర్మించాలి.

(3) నక్కపల్లి లో ప్రభుత్వ డిగ్రీ కాలేజీకి వెంటనే స్వంత భవనాలు నిర్మించాలి,ఎస్.రాయవరం,కొరుప్రోలు గ్రామాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు వెంటనే స్వంత భవనాలు నిర్మించాలి, సరిపడా లెక్చరర్స్, మౌలిక వసతులు కల్పించాలి.

(4). నక్కపల్లి లో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఐటిఐ, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేయాలి.

(5). నక్కపల్లి ప్రభుత్వ వంద పడకల ఆసుపత్రి కి సరిపడా డాక్టర్స్, సిబ్బంది, మౌలిక వసతులు కల్పించాలి. ట్రామా కేర్ సెంటర్ వెంటనే ఏర్పాటు చేయాలి.

(6) వైజాగ్, చెన్నై ఇండస్ట్రీయల్ కారిడార్ లో భాగంగా ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ నిర్వాసితులకు ఆర్ కార్డులు ఇవ్వాలి.రెండో విడత ప్యాకేజీ లిస్టు, ఆడపిల్లలకు ప్యాకేజీ వెంటనే ఇవ్వాలి.ఆర్ అండ్ ఆర్ కాలనీ లో మౌలిక సదుపాయాలు తక్షణం కల్పించాలి.



(7). ఎస్.రాయవరం మండలం ఎస్.ఏ.ఓ.బి నిర్వాసితుల సమస్యలు పరిష్కారం చేయాలి.

(8). నక్కపల్లి మండలం రాజయ్య పేట పంచాయతీ బోయపాడు వద్ద వెంటనే ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం చేపట్టాలని సముద్ర తీరంలో ప్రతి పది కిలోమీటర్లు పరిధిలో మత్స్యకారుల జీవనోపాధికి ఫిషింగ్ జెట్టీలు నిర్మించాలి.

(9). విదేశాల్లో నిషేధించిన బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయడానికి నక్కపల్లి మండలంలో చేపడుతున్న బలవంతపు భూ సేకరణ ఆపాలని బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు విరమించుకోవడం హెటిరోడ్రగ్స్ ముందుల కంపెనీకి రెండో పైపులైన్ వేసుకోవడానికి సిఆర్ జెడ్ ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని కోరారు.

(10) ఎస్.రాయవరం మండలం, ధర్మవరం అగ్రహారం గ్రామం నుండి ఎస్.రాయవరం మండల కేంద్రానికి వెళ్ళే రోడ్డు వేంటనే వెడల్పు చేయాలన్నారు.

(11). నక్కపల్లి మండలం,ఉద్దండపురం వద్ద నిర్మిస్తున్న వాటర్ ప్రోజెక్ట్, ద్వారా అన్ని గ్రామాలకు రక్షిత మంచినీరు అందించాలని తెలిపారు.

(12). నక్కపల్లి లో గల ఎస్సీ, బీసీ బాలురు హాస్టల్స్ స్వంత భవనాలు నిర్మించాలి, రాజయ్య పేట లో ఏర్పాటు చేసిన బీసీ బాలికల గురుకుల పాఠశాలకు స్వంత భవనాలు నిర్మించాలని పేర్కొన్నారు.

(13). కోటవురట్ల మండలం అణుకు గిరిజన గ్రామానికి,తడపత్రి, బోణి కొత్తూరు, కోదండరాం పురం గిరిజన గ్రామాలకు తారు రోడ్లు ఏర్పాటు చేయాలి.

(14) అడ్డు రోడ్డు జంక్షన్ లో ఆర్టీసీ కాంప్లెక్స్,సులాబ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి బహిరంగ లేఖ రాస్తున్నామని అయిన తెలిపారు

కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం రాజేష్ కే ప్రసాద్ తదితరులు ఉన్నారు.

# ఎంపీ ల్యాడ్స్ వినియోగంలో టాప్‌లో నిలిచిన వైయస్ఆర్‌సీపీ ఎంపీ మేడా

**ఢిల్లీ:పెన్ సత్తా, ఆగస్టు 31:** ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీ ల్యాడ్స్ వినియోగంలో వైయస్ఆర్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి టాప్‌లో నిలిచారు. ఏపీ లోక్‌సభ, రాజ్యసభ ఎంపీల్లో మేడా రఘునాథరెడ్డి ఎంపీ ల్యాడ్స్ వినియోగంలో అగ్రస్థానాన్ని సాధించారు

తనకు కేటాయించిన నిధుల్లో 55.17 శాతం అభివృద్ధి పనులకు ఎంపీ మేడా రఘునాథరెడ్డి ఖర్చు పెట్టారు. గ్రామాలలో సిసి రోడ్ల పనులకు అత్యధికంగా నిధులను ఖర్చుపెట్టారు. 14.7 కోట్ల రూపాయల నియోజకవర్గ నిధుల కేటాయింపులలో 8.10 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. 139 ప్రాజెక్టులకు సిఫారసు చేయగా 110 ప్రాజెక్టులు పూర్తి కాగా, మరో 29 పనులు కొనసాగుతున్నాయి.

ఇక నాలుగో స్థానంలో అరకు ఎంపీ డాక్టర్ గుమ్మ తనుజా రాణి నిలిచారు. తనకు కేటాయించిన నిధుల్లో ఇప్పటివరకూ 48.94 శాతం నిధులను వినియోగించారు. ఇక తను కేటాయించిన ఎంపీ నిధుల్లో 35.71 శాతం ఖర్చుపెట్టిన ఏడో స్థానంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి నిలిచారు. ఈ జాబితాలో కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అట్టడుగు స్థానంలో నిలిచారు. తనకు కేటాయించిన నిధుల్లో ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు వర్మ. ఎంపీ ల్యాడ్స్ నిధులపై ఎంపవర్డ్ ఇండియన్ నివేదిక ద్వారా ఈ విషయాలు వెల్లడయ్యాయి.



# సారిపల్లి వానిపాలెం లో ఘనంగా శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ

కార్యక్రమానికి హాజరైన ప్రముఖ రాజకీయ నాయకులు





**నక్కపల్లి, పెన్ సత్తా, ఆగస్టు 31:** మండలంలో ఉమాక గ్రామపంచాయతీ శివారు గ్రామం సారి పల్లి వానిపాలెం లో శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామస్తులు ఆర్థిక సాయంతో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణుని ఆలయంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. వేద పండితులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్ఠ చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దీనిలో భాగంగా స్వామివారిని పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు రాజకీయ పార్టీల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనే స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందరావు, వైయస్సార్సీపి పెందుర్తి నియోజకవర్గం పరిశీలకులు చిక్కాల రామారావు, వైఎస్ఆర్సిపి నాయకులు యనమల కృష్ణుడు, శీరం నరసింహ మూర్తి,గెడ్డమూరి శ్రీనివాసరావు, కో ఆప్షన్ సభ్యులు లోడగల చంద్రరావు, మాజీ పిఎసిఎస్ చైర్మన్ యలమంచిలి తాతబాబు, రేబాక మాజీ సర్పంచ్ సాదిరెడ్డి శ్రీను, ఉపమాక ఎంపీటీసీ కొల్లాటి బుజ్జి, తుమ్మ కల్పన తల్లా భార్గవ్, వియ్యపు శ్రీను, సింహాద్రి యాదవ్, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు. ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## వెలిగొండలో మరోసారి చంద్రబాబు క్రెడిట్ చోరీ

**తాడేపల్లి:పెన్ సత్తా, ఆగస్టు 31:** అప్పుడు వైయస్ఆర్, ఆ తర్వాత వైయస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో వేగంగా సాగిన వెలిగొండ ప్రాజెక్టు పనులను తనవిగా చెప్పుకుంటూ చంద్రబాబు మరోసారి క్రెడిట్ చోరీకి పాల్పడుతున్నారని వైయస్ఆర్‌సీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మండిపడ్డారు. వెలిగొండ ప్రాజెక్టులో తాను చేయని పనులను సైతం చెప్పుకుంటున్న చంద్రబాబు.. నిర్వాసితులకు పూర్తి స్థాయిలో అందించాల్సిన పరిహారాన్ని ఎగ్గొట్టడమే కాకుండా, వారిపై ఎదురువేధింపులకు దిగుతున్నారని తాటిపర్తి చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అమరావతి రైతుల తరహాలో వెలిగొండ నిర్వాసితులకు కూడా ప్యాకేజీ ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రెస్‌మీట్‌లో తాటిపర్తి చంద్రశేఖర్ ఇంకా ఏమన్నారంటే...

వెలిగొండపై చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే

ఈ రోజు వెలిగొండ ప్రాజెక్టుపై చంద్రబాబు పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నారు. కానీ ఈ ప్రాజెక్టు నిర్మాణం వెనుక ఉన్న కర్త, కర్మ, క్రియ ఎవరో ఒకసారి రాష్ట్ర ప్రజలంతా గమనించాలి. నిజంగా పూల సుబ్బయ్య గారి పోరాటం లేకపోతే, వైయస్ఆర్ గారి సంకల్పం లేకపోతే, వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు టన్నెల్స్ పూర్తి చేసి జాతికి అంకితం చేసి ఉండకపోతే, ఆ ప్రాంత ప్రజలు తమ జీవితాలను త్యాగం చేసి స్థలాలు ఇవ్వకపోతే ఆ ప్రాజెక్టు ఉండేదా? ఈ ప్రాజెక్టు లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తుందని ఆశిస్తున్నాం. దీని వెనుక వీరందరి కష్టం, త్యాగం, పట్టుదల, కృషి లేదా? ప్రతిదీ నాదే అని చెప్పుకునే చంద్రబాబు ఇవాళ మరోసారి క్రెడిట్ చోరీ చేశారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయిందంటే దానికి సంబంధించిన కాలువలు, టన్నెల్స్ పూర్తవ్వాలి. ఇవన్నీ చేయకుండా వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు జాతికి అంకితం ఎలా చేస్తారని ప్రశ్నిస్తున్నారు. కానీ ఇప్పుడు మీరు చేస్తున్నదేంటి? వెలిగొండ ప్రాజెక్టుకు గుండెకాయ అయిన సొరంగాలను పూర్తి చేసి, మళ్లీ అధికారంలోకి రాగానే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి నల్లమలసాగర్‌లోకి నీటిని నింపుతామని వాటిని జాతికి అంకితం చేసేటప్పుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు స్పష్టంగా చెప్పినా.. పూర్తి ప్యాకేజీని జాతికి అంకితం చేసినట్లుగా తప్పుడు ప్రచారాలు చేశారు. మరి ఇప్పుడు చంద్రబాబు చేసిందేంటి? వెలిగొండ ప్రాజెక్టు అంటే వైయస్ఆర్ గారు కేవలం రెండు సొరంగాలు అనుకోలేదు, గొట్టిపడియ, కాకర్ల, సుంకేశుల డ్యామ్‌లు మాత్రమే అనుకోలేదు. జంట సొరంగాలు, నల్లమలసాగర్, సుంకేశుల, గొట్టిపడియ, కాకర్ల డ్యామ్‌లు అన్నీ కలిపితేనే వెలిగొండ ప్రాజెక్టు. దీంతో పాటు 62 వేల ఎకరాలకు నీళ్లిచ్చే తీగలేరు కుడి, ఎడమ కాలువలు కలిపితేనే కదా వెలిగొండ ప్రాజెక్టు. ఇప్పుడు నేను వెన్నుపోటు పార్టీ నాయకులకు సవాల్ విసురుతున్నా. నేను చెబుతున్న ఈ పనులన్నీ మేమే మొదలుపెట్టి, పూర్తి చేశామని చెప్పుకునే దమ్మూ ధైర్యం మీకూ, మీ నాయకుడికి ఉందా అని ప్రశ్నిస్తున్నా. సమాధానం చెప్పండి.

వెలిగొండ ప్రదాతలు వైయస్ఆర్, వైయస్ జగన్ మోహన్ రెడ్డిలే

1993లో మొదలైన ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధంగా ఉండగా.. ఎనిమిదేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు, కేంద్రంలో చక్రాలు తిప్పిన వ్యక్తి అనుమతులు ఎందుకు తీసుకురాలేదు, పక్క రాష్ట్రాన్ని ఎందుకు ఒప్పించలేదు, నల్లమలసాగర్ డ్యామ్‌లు ఎందుకు నిర్మించలేకపోయారు, అర్ధరూపాయి ఖర్చు ఎందుకు పెట్టలేకపోయారు, అయినా నిస్సిగ్గుగా మేం ఖర్చుపెట్టామని అబద్ధాలు చెప్పుకుంటున్నారు. ఛాట్‌జీపీటీని అడిగితే మీ నిర్వాకం ఏంటో చూపిస్తుంది. 2014కు ముందు చంద్రబాబు ఈ ప్రాజెక్టులో ఏదైనా పని చేసి ఉంటే, భూసేకరణ చేసి ఉంటే, ఒక్క డ్యామ్ అయినా నిర్మించి ఉంటే ఫొటోలు బయటపెట్టండి. దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి గారు ఈ ప్రాజెక్టుకు సంకల్పించి, పశ్చిమ ప్రకాశం వాసుల జీవనాడి అని గుర్తించి, కడప, నెల్లూరుకు తాగు, సాగునీరు ఇచ్చే వరప్రదాయిని అవుతుందని గుర్తించి, అధికారం చేపట్టిన తొలిసారే ఐదు వేల కోట్లు వెచ్చించి పనులు చేపట్టారు. ఈ రోజుకీ తీగలేరు కెనాల్‌కు తవ్విన కాలువలను చూస్తే రాజశేఖర్ రెడ్డి గారు చేసిన పనులు గుర్తుకొస్తాయి. ఆ తర్వాత మళ్లీ పనులు ఆగిపోయాయి. కోవిడ్ సమయంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారు కొండల్ని తొలిచి సొరంగాలు ఏర్పాటు చేశారు. రెండేళ్లు వృథా పోయినా ఎక్కడా తలవంచకుండా మూడేళ్లలో రూ.1,050 కోట్లు వెచ్చించారు. అంటే ఏడాదికి రూ.350 కోట్ల చొప్పున ఖర్చు పెట్టారు. ఆ లెక్కన వెన్నుపోటు పార్టీ 20 ఏళ్లలో ఎన్ని వేల కోట్లు ఖర్చుపెట్టాలి? ఇవాళ నీళ్లు వదులుతున్నానని సాష్టాంగ నమస్కారం చేస్తున్న చంద్రబాబు.. రాజశేఖర్ రెడ్డి గారి సంకల్పానికి నమస్కారం చేయాలి, వైయస్ జగన్ మోహన్ రెడ్డి గారి సంకల్పానికి నమస్కరించాలి. అదంతా వదిలేసి కోట్లు కుమ్మరించి సర్కార్ వారి సర్కస్ ఫీట్లు చేశారు. మీరు ఇవన్నీ డ్యామ్ దగ్గర చేయకుండా గంటవానిపల్లి దగ్గర ఎందుకు చేశారు? డ్యామ్ దగ్గరికి వెళ్లి ఉంటే నిర్వాసితులు మీ దుర్మార్గాన్ని బయటపెట్టేవారు.

# గుడివాడ వైసీపీలో గడబిడ.. మాజీ మంత్రి కొడాలిపైనే ఆశ!



**హైదరాబాద్ :** స్థానిక ఎన్నికలు సమీపిస్తుండటంతో ఏపీ రాజకీయాలు హీటెక్కుతున్నాయి. ప్రధానంగా రాష్ట్రంలో కొన్ని మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు ఉత్కంఠకు దారితీస్తున్నాయి. స్థానిక ఎన్నికల్లో వచ్చే ఫలితాలు కూటమి ప్రభుత్వానికి రెఫరెండంగా పరిగణించే పరిస్థితులు ఉండగా, వచ్చే ఎన్నికల నాటికి నిలదొక్కుకోవాలంటే ఈ ఎన్నికల్లో తప్పక విజయం సాధించాల్సిన పరిస్థితిలో విపక్షం వైసీపీ ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలోని ముఖ్యనేతలకు చెందిన నియోజకవర్గాల్లో ఎన్నికలు ఎలా ఉంటాయనేది తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి సొంత నియోజకవర్గంపై దృష్టిపెట్టిన అధికార టీడీపీ 'వైనాట్ పులివెందుల' అంటూ గర్జిస్తుంది. ఇక వైసీపీలో జగన్ తర్వాత టీడీపీ మెయిన్ టార్గెట్ గా ఉన్న మాజీ మంత్రి కొడాలిని కూడా దెబ్బతీయాలనే వ్యూహంతో ఆయన సొంత నియోజకవర్గం గుడివాడపైనా పక్కా వ్యూహరచన చేస్తున్నట్లు చెబుతున్నారు.

వైసీపీ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గుడివాడ మున్సిపాలిటీని ఆ పార్టీ సునాయాశంగా దక్కించుకుంది. మొత్తం 31 వార్డులు ఉండగా, అన్ని స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థులే గెలుపొందారు. ఇటువంటి బలమైన పట్టు ఉన్న మున్సిపాలిటీని నిలబెట్టుకోవడం ఇప్పుడు వైసీపీకి అత్యంత ప్రధానంగా చెబుతున్నారు. అయితే క్షేత్రస్థాయి పరిస్థితులు అనేక సవాళ్లు విసుతున్నాయని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా వైసీపీ ఇంచార్జి, మాజీ మంత్రి కొడాలి నాని స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో కేడర్ డీలా పడుతోందని అంటున్నారు. రెండేళ్లుగా ఆయన ఎక్కువగా హైదరాబాదులోనే ఉంటున్నారు. అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నా, బలమైన ప్రభుత్వంతో ఢీకొట్టడం కేడర్ కు అంత ఈజీ ఏమీ కాదని అంటున్నారు.

ఈ పరిస్థితుల్లో గుడివాడ మున్సిపాలిటీపై వైసీపీ శ్రేణుల్లో ఒక రకమైన ఆందోళన కనిపిస్తోందని అంటున్నారు. మాజీ మంత్రి కొడాలి అందుబాటులో ఉంటే కూటమి ప్రభుత్వాన్ని ఎదిరించగలమని పార్టీ శ్రేణులు చెబుతున్నారు. అయితే కొడాలి ఎన్నికల ముందు వచ్చి ప్రచారం చేస్తామంటే ఫలితం ఉండదని తేల్చిచెబుతున్నారు. దీంతో గుడివాడ భారం అంతా మాజీ మంత్రి కొడాలి భుజాలపై మోపుతున్న పరిస్థితి ఉందని అంటున్నారు. నిజానికి గుడివాడలో రెండు దశాబ్దాలుగా కొడాలి నాని పోటీ చేశారు. గత ఎన్నికల్లో ఆయన తొలిసారిగా ఓడిపోయారు. పట్టణంలో వ్యక్తిగత ఇమేజ్ ఉండటంతో వైసీపీ గట్టి పోటీ ఇచ్చే సూచనలు కనిపిస్తున్నాయని అంటున్నారు. అయితే కొడాలి తక్షణం హైదరాబాద్ వదిలి వస్తేనే ఈ పోటీ ఇవ్వగలిగే పరిస్థితిలో వైసీపీ ఉంటుందనే అంచనాలు వేస్తున్నారు. మరోవైపు మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు టీడీపీలో ఉండటం కూడా వైసీపీకి ఆందోళన కలిగిస్తోందని చెబుతున్నారు. ఒకప్పుడు మాజీ మంత్రి కొడాలి సన్నిహితుడిగా పట్టణంలో రాజకీయాలను యలవర్తి చక్కబెట్టేవారని, కొడాలి లేకున్నా ఆయన తన ప్రతిభతో పార్టీని నడిపించేవారని అంటున్నారు. అయితే ఇప్పుడు ఆయన టీడీపీ తరఫున గట్టిగా పనిచేయడం, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కూడా టీడీపీ కేడర్ కు వెన్నుదన్నుగా నిలుస్తూ మున్సిపాలిటీపై పసుపు జెండా ఎగరేసేలా వ్యూహాలు రచిస్తుండటంతో వైసీపీ కేడర్ వెనక్కి తగ్గాల్సివస్తోందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ఏదిఏమైనా కీలకమైన గుడివాడలో వైసీపీ పూర్వవైభం సాధించాలంటే మున్సిపల్ ఎన్నికల్లో మాజీ మంత్రి కొడాలి చూసే తెగువే ప్రధాన పోషిస్తుందని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

# మూడు మేయర్ సీట్లపై కమలం పార్టీకి పట్టు..




**విశాఖపట్టణం, ఆగస్టు 31, :** ఇటు టీడీపీ. ఇటు జనసేన. కూటమిలోని ఈ రెండు పార్టీలు.. స్థానిక ఎన్నికలపై ఎవరి లెక్కల్లో వారు బిజీగా ఉన్నారు. బీజేపీ కూడా సైలెంట్‌గా ఉంటూనే పకడ్బందీ ప్లానింగ్స్ చేస్తోందట. కార్పొరేషన్ ఎన్నికల్లో డైరెక్ట్ ఫైట్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాలకు పదును పెడుతోందట కమలం పార్టీ. విశాఖ మేయర్ పీఠంపై బీజేపీ స్పెషల్ ఫోకస్ పెట్టిందట. ఏపీ నగర పాలక సంస్థల్లో గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ అతిపెద్దది. 125 డివిజన్ల డీలిమిటేషన్ ప్రాసెస్ కూడా జరగబోతోంది. విశాఖ జిల్లాతో పాటు అనకాపల్లి జిల్లాలో విస్తరించి ఉంది. అందుకే ఇక్కడ మేయర్ పీఠం అంటే దాదాపు క్యాబినెట్ మంత్రితో సమానం అన్నట్లుగా భావిస్తున్నారు. ఆంధ్ర ప్రదేశ్ వార్తలుఏడాదికి ఐదారు వేల కోట్ల బడ్జెట్ ఉండే గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పీఠం అంటే చాలా పెద్ద పదవి అనే చెప్పొచ్చు. ప్రత్యక్ష ఎన్నికలు జరగబోతుండటంతో తమ పార్టీ అభ్యర్థిని రంగంలోకి దించాలని మూడు పార్టీలు ఆశిస్తున్నాయి. బీజేపీ ఈ మేయర్ పీఠాన్ని తమకు విడిచి పెట్టాలని కోరాలని డిసైడ్ అయిందట. 1979లో కాంగ్రెస్ పార్టీతో పోటీపడి మరీ ప్రత్యక్ష ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని సొంతం చేసుకుంది బీజేపీ. అప్పుడు జనసంఘ్ రూపంలో ఉన్న బీజేపీ.. తొలిసారి విశాఖ మేయర్ అభ్యర్థిని గెలిపించుకొని హిస్టరీ క్రియేట్ చేసింది. ఇప్పటికీ విశాఖ నగరంలో బీజేపీకి మంచి పట్టు ఉన్నట్లు చెబుతుంటారు. మొన్నటి ఎన్నికల్లో విశాఖ ఎంపీ సీటు బీజేపీకి ఇస్తారని ప్రచారం నడిచింది. కాని పొత్తుల్లో భాగంగా పక్కనున్న అనకాపల్లి స్థానం బీజేపీకి దక్కగా.. అక్కడి నుంచి కమలం పార్టీ ఎంపీ అభ్యర్థిగా సీఎం రమేష్ గెలిచారు. విశాఖ గ్రేటర్ పరిధి అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో కూడా కొంత విస్తరించి ఉంటుంది. దీంతో తమకు గ్రేటర్ పీఠం ఇస్తే ఈజీగా గెలుచుకోవచ్చనే అంచనాల్లో ఉందట కమలం పార్టీ. సేమ్‌టైమ్ గత ఎన్నికల్లో తమకు విశాఖ ఎంపీ సీటు ఇవ్వకపోవడంతో.. ఇప్పుడు మేయర్ పీఠం అయినా వదిలేయాలని రిక్వెస్ట్ చేస్తున్నారు బీజేపీ నేతలు. విశాఖ మేయర్ సీటుతో పాటు.. విజయవాడ, తిరుపతి నగర పాలక సంస్థలపై కూడా బీజేపీ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గ్రేటర్ విశాఖ పరిధిలో బీజేపీకి ఓ ఎమ్మెల్యే, మరో ఎంపీ ఉన్నారు. 2014లో కూడా విశాఖ ఎంపీ సీటును బీజేపీ గెలిచింది. దీంతో తమకు పట్టున్న చోట మేయర్ సీటు దక్కించుకొని.. ఇంకా బలం పెంచుకునే ప్లాన్‌లో ఉన్నారట కమలనాథులు. ఇక గత ఎన్నికల్లో విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సీటును గెలుచుకున్న బీజేపీ.. బెజవాడ మేయర్ సీటుకోసం పట్టుబట్టేందుకు రెడీ అవుతోందట. తిరుపతి మేయర్ స్థానం కూడా తమకే ఇవ్వాలని కోరబోతోందట. కూటమి పెద్దల భేటీలో తమ వాదనను బలంగా వినిపించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. స్టేట్ మొత్తంలో అర్బన్ ఏరియాల్లో తమ ప్రాతినిధ్యాన్ని మరింత పెంచుకోవాలని బీజేపీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల్లో పార్టీకి తగిన ప్రాధాన్యం దక్కేలా సీట్ల సర్దుబాట్లపై దృష్టి పెట్టాలని బీజేపీ డిసైడ్ అయిందట. రాష్ట్రంలో 17 మున్సిపల్ కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. వీటిలో మేయర్, మున్సిపల్ ఛైర్మన్ పదవుల పంపకంపై ఇప్పటి నుంచే రాజకీయ చర్చలు మొదలైనట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా విశాఖతో పాటు విజయవాడ, తిరుపతి నగరాలు రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మికంగా కీలకమైనవి కావడంతో ఇక్కడ మేయర్ పీఠాలను దక్కించుకుంటే పార్టీకి సంస్థాగతంగా, రాజకీయంగా మరింత ప్రయోజనం ఉంటుందని బీజేపీ అంచనా వేస్తోందట. పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు, స్థానిక బలాబలాలు వంటి సమీకరణలు మేయర్ అభ్యర్థుల ఎంపికలో కీలకంగా మారే అవకాశం ఉంది. ఉత్తరాంధ్రలో తమకు ఎక్కువ సీట్లు ఇవ్వాలని బీజేపీ నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌పై ఒత్తిడి తెస్తున్నారట. అసెంబ్లీ ఎన్నికల్లో సర్దుబాట్ల కోసం ఫాలో అయిన విధానం కాకుండా.. ఇప్పుడు స్థానికంగా పార్టీల బలం, అభ్యర్థుల సామర్థ్యం, వార్డుల వారీగా సమీకరణాలను లెక్కలులోకి తీసుకోవాల్సి ఉంటుంది. విశాఖ, విజయవాడ, తిరుపతి మేయర్ పీఠాల కోసం బీజేపీ పట్టుబడితే.. కూటమిలోని టీడీపీ, జనసేన నుంచి స్పందన ఎలా ఉంటుందో.. కమలం పార్టీ ఆశించినట్లు మేయర్ సీట్లు దక్కుతాయో లేదో చూడాలి మరి.

# ఇంటి వద్దకే బస్సు...

**విజయవాడ, ఆగస్టు 31,**

ప్రయాణికుల కోసం ఏపీఎస్‌ఆర్టీసీ మరో సరికొత్త ప్రయోగానికి శ్రీకారం చుట్టనుంది. ఇంటి వద్దే పికప్ సౌకర్యం కల్పించే ఆలోచన చేస్తోంది. పదిమందికిపైగా బల్క్ బుకింగ్ చేసుకుంటే వారి ఇంటి వద్దకే బస్సును పంపించే ఆలోచన చేస్తోంది. అయితే దూరప్రాంతాలకు వెళ్లే హైయ్యెండ్ బస్సు సర్వీసులలోనే ఈ విధానం అమలు చేయనున్నారు. అది కూడా విజయవాడ నగర పరిధిలో మాత్రమే ఈ విధానం అమలు చేసేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ ఎప్పటికప్పుడు కొత్త చర్యలు చేపడుతూ వస్తోంది. ప్రయాణికుల ఆదరణ చూరగొనేందుకు కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే విజయవాడ రీజియన్ ఆర్టీసీ అధికారులు ఓ సరికొత్త విధానాన్ని అనుసరించనున్నారు. ప్రయాణికుల ఇంటి వద్దకే బస్సు పికప్ సదుపాయాన్ని కల్పించేందుకు ప్రణాళికలు రచిస్తున్నారు. అయితే ఇవి కేవలం కొన్ని బస్సులకే అమలు చేయనున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ అగ్రశ్రేణి బస్సులలో పదిమందికి పైగా ప్రయాణికులు తమ టికెట్లను బల్క్‌గా బుక్ చేసుకుంటే.. ఆర్టీసీ అధికారులు ఇంటి వద్దకే పికప్ కోసం బస్సును పంపించే ఆలోచన చేస్తున్నారు. మరోవైపు ఏపీఎస్‌ఆర్టీసీకి చెందిన సూపర్ లగ్జరీ, ఏసీ, స్లీపర్ వంటి బస్సులు దూరప్రాంతాలకు సేవలు అందిస్తుంటాయి. ఈ బస్సులలో ప్రయాణించేందుకు మనమంతా ముందుగానే టికెట్లు బుక్ చేసుకుంటూ ఉంటాయి. అందులో నిర్దేశించిన సమయానికి బస్టాండ్ వద్దకు చేరుకుంటూ ఉంటాం. అయితే లగేజీ ఎక్కువగా ఉన్న సమయంలో బస్సులు ఆగే చోటకు చేరుకోవడం ఒక్కొక్కసారి ఇబ్బందిగా మారుతూ ఉంటుంది. ఇలాంటి ఇబ్బందులకు ఫుల్ స్టాప్ పెట్టేందుకు ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు ఈ ఇంటి వద్దే బస్ పికప్ ఆలోచన చేస్తున్నారు. ప్రయాణికులు బల్క్‌గా టికెట్లు బుక్ చేసుకున్న సమయంలో.. వారిని ఇంటి వద్ద నుంచే పికప్ చేసుకునే సౌకర్యం కల్పించాలని నిర్ణయం తీసుకున్నారు. అయితే రాష్ట్రవ్యాప్తంగా కాకుండా తొలుత ప్రయోగాత్మకంగా విజయవాడ నగర పరిధిలోనే ఈ ఇంటి వద్దే పికప్ విధానాన్ని అమలు చేయాలని ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా హైయ్యెండ్ శ్రేణిలో ఉన్న అన్ని ఏపీఎస్‌ఆర్టీసీ బస్సులను ప్రయాణికుల ఇళ్ల వద్దకు పంపించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే ఎవరైతే పదికి పైగా బల్క్‌గా టికెట్లు బుక్ చేసుకుంటారో ఆ ప్రయాణికులు.. తమ బుకింగ్ సమాచారాన్ని ముందుగా ఆర్టీసీ అధికారులకు తెలియజేయాల్సి ఉంటుంది. ఇక ఈ విధానాన్ని అమలు చేసేందుకు గానూ త్వరలోనే కొత్త వ్యవస్థను అమల్లోకి తెచ్చేందుకు విజయవాడ ఏపీఎస్‌ఆర్టీసీ అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించిన వివరాలు త్వరలోనే పూర్తిగా వెల్లడికానున్నాయి

# ఏపీలో స్థానిక ఎన్నికలు..
# చంద్రబాబు బాటలో జగన్!

**కడప ఆగస్టు 31, :** వైయస్ జగన్మోహన్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక ప్రకటన చేశారు. ఒకవేళ ఎక్కడైనా ఏకగ్రీవాలు జరిగితే అటువంటి చోట నియోజకవర్గ ఇన్చార్జి లకు టికెట్లు ఇవ్వనని తేల్చి చెప్పారు. కానీ ఈ ప్రకటన వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అర్థం అవుతోంది. కచ్చితంగా ఈ ప్రకటనతో తెలుగుదేశం కూటమి ముందుగానే పావులు కదుపుతుంది. ముందుగా పులివెందుల నియోజకవర్గం పైనే ఫోకస్ పెడుతుంది. గత ఏడాది పులివెందుల జడ్పిటిసి స్థానం ఏ విధంగా పట్టుబట్టి గెలిచిందో.. కచ్చితంగా పులివెందుల మునిసిపాలిటీని సైతం అలాగే కైవసం చేసుకుంటుంది. ప్రత్యక్ష ఎన్నికలు కావడంతో ఒకరు మున్సిపల్ అభ్యర్థిగా వైసీపీ తరఫున బరిలో నిలుస్తారు. కానీ ఆ పార్టీకి కౌన్సిలర్ల అభ్యర్థులు మాత్రం దొరకరు. అంతలా ఉంటుంది టిడిపి వేట అక్కడ. ఇప్పటికే టిడిపి బృందం ఒకటి పులివెందులలో వాలిపోయింది. వారు వార్డుల్లో ఏకగ్రీవాలకు అప్పుడే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయిపులివెందులలో ఏకగ్రీవాలు జరిగితే మాత్రం జగన్మోహన్ రెడ్డి నుంచి మరో ప్రకటన వచ్చే అవకాశం ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి ఏకపక్షంగా గెలిచి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి స్థానం దక్కకపోతే మాత్రం జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా డిఫెన్స్ లో పడతారు. అయితే కీలక కూటమి నేతలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో చాలా మున్సిపాలిటీలు ఏకగ్రీవాలు జరుగుతాయి. అది జగన్మోహన్ రెడ్డికి కూడా తెలుసు. ఒకవేళ ఏకగ్రీవాలు జరిగి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఓటమి ఎదురైతే.. జగన్మోహన్ రెడ్డి కచ్చితంగా స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తారు. ఇది జరిగే పని అంటూ విశ్లేషకులు సైతం అభిప్రాయపడుతున్నారు. 2021లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఆ సమయంలో ముందుగా పంచాయితీల ఎన్నికలు జరిగాయి. తరువాత మున్సిపల్ ఎన్నికలు జరిగాయి. కుప్పం నియోజకవర్గంలో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మొత్తం మోహరించింది. ఎలాగైనా మున్సిపాలిటీ ని కైవసం చేసుకోవాలని చూసింది. అయినా సరే టిడిపి శ్రేణులు ప్రతిఘటించాయి. కానీ ఫలితం లేకపోయింది. పరిమిత వార్డులకే టిడిపి పరిమితం అయింది. అంతకుముందు పంచాయతీ ఎన్నికల్లో సైతం ప్రలోభాలతో, భయపెట్టి మరి వైసీపీ సానుభూతిపరులు గెలిచారు. కేవలం కుప్పం ఫలితాలతో చంద్రబాబు ఆలోచనలో పడ్డారు. అందుకే తరువాత వచ్చిన మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికలను బహిష్కరించారు చంద్రబాబు. ఇప్పుడు కూడా మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీకి అదే పరిస్థితి ఎదురైన మరుక్షణం.. తరువాత ఆ రెండు స్థానిక ఎన్నికలను జగన్మోహన్ రెడ్డి బహిష్కరిస్తారు. ఇది ఒక వ్యూహం అని తెలుస్తోంది. స్థానిక ఎన్నికలు బహిష్కరించిన చంద్రబాబు స్ట్రాటజీ అప్పట్లో చాలా విమర్శలకు తావిచ్చింది. కానీ సార్వత్రిక ఎన్నికల నాటికి ఆ ప్రయోగమే ఫలించింది. ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి సైతం అదే ఫార్ములాను అనుసరించనున్నారు.

## జొన్నగిరిలో వజ్రాల వేట

**కర్నూలు ఆగస్టు 31, :** కర్నూలు జిల్లాలోని జొన్నగిరి ప్రాంతం వజ్రాల వేటకు ప్రసిద్ధి. వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ఇక్కడి ప్రజలు, చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన వారు వజ్రాల కోసం పొలాలు, పరిసర ప్రాంతాల్లో వెతుకులాట ప్రారంభిస్తారు. ముఖ్యంగా భారీ వర్షాలు కురిసిన తర్వాత నేలపైకి కొట్టుకొచ్చే రాళ్లు, ఖనిజాల్లో వజ్రాలు దొరికే అవకాశం ఉందన్న నమ్మకంతో చాలామంది ఈ వేటకు వస్తుంటారు. జొన్నగిరి ప్రాంతంలో వర్షం కురిసిన తర్వాత పొలాల్లోని మట్టి కొట్టుకుపోయి, భూమి లోపలి పొరల్లో ఉన్న రాళ్లు బయటపడతాయి. దీంతో వజ్రాల కోసం వెతికేవారికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని స్థానికులు చెబుతుంటారు. వర్షం తగ్గిన వెంటనే కొందరు స్థానికులు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు పొలాల్లోకి వెళ్లి నేలను జల్లెడ పడతారు. మెరుస్తున్న రాళ్లు కనిపిస్తే వాటిని సేకరించి పరీక్షించుకుంటారు. జొన్నగిరి ప్రాంతంలో గతంలో వజ్రాలు లభించాయన్న వార్తలు తరచూ వెలువడ్డాయి. కొందరికి విలువైన రాళ్లు దొరికాయని ప్రచారం జరగడంతో వర్షాకాలంలో వజ్రాల వేటపై ఆసక్తి మరింత పెరుగుతోంది. అయితే ప్రతి మెరిసే రాయి వజ్రం కాదని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కనిపించే కొన్ని ఖనిజాలు కూడా వజ్రాల మాదిరిగా మెరుస్తుంటాయి. నిజంగా వజ్రమా కాదా అనేది నిపుణుల పరీక్షల ద్వారానే నిర్ధారించాల్సి ఉంటుంది. వజ్రం దొరికితే ఒక్కసారిగా తమ జీవితాలు మారిపోతాయన్న ఆశతో కొందరు వర్షం పడిన ప్రతిసారీ పొలాల్లోకి వెళ్తుంటారు. గంటల తరబడి నేలను పరిశీలిస్తూ రాళ్లను ఏరుకుంటారు. వర్షాకాలంలో జొన్నగిరి ప్రాంతంలో కనిపించే ఈ దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. అయితే వజ్రాల వేటకు వెళ్లేవారు స్థానిక నిబంధనలు, భూమి యజమానుల అనుమతులు, భద్రతా అంశాలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. వర్షం పడితే జొన్నగిరిలో మొదలయ్యే ఈ వజ్రాల వేట.. అదృష్టాన్ని పరీక్షించుకునే ప్రయత్నంగా మారుతోంది.

## 25 ఇండస్ట్రియల్ పార్క్‌లకు లైన్ క్లియర్

**అనంతపురం ఆగస్టు 31, :** కేంద్రం భవ్య పథకం కింద దేశవ్యాప్తంగా పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని సంకల్పించింది. ఇందులో భాగంగా తొలి దశలో దేశవ్యాప్తంగా 20 పార్కుల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానించగా ఏపీఐఐసీ ఆరింటికి ప్రతిపాదనలు పలికింది. అయితే రెండు పార్కులకు మాత్రమే కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. దాంతో రెండో దశలో 16 చోట్ల పార్కుల అభివృద్ధికి వీలుగా ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ 22తో పాటు మరో మూడు పార్కులను కూడా అభివృద్ధి చేయాలని భావిస్తోంది. దాని కోసమే ఇప్పుడు 25 పార్కులకు 20 ఎకరాలను కూడా రాష్ట్ర ప్రభుత్వం సేకరించింది. కూటమి ప్రభుత్వం పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త కళ సంతరించుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలైనా, కేంద్ర ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలైనా.. అభివృద్ధి చర్యలైనా ఆంధ్రప్రదేశ్ వరకూ వస్తున్నాయి. ఏపీలోని అధికారిక కూటమి ప్రభుత్వంలో బీజేపీ కూడా భాగస్వామ్యం కావడంతో దేశ వ్యాప్తంగా భవ్య పథకం కింద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక పార్కుల్లో ఏపీకి కూడా అవకాశం కల్పించారు. రాష్ట్రంలో 25 భారీ పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయాలని ఏపీఐఐసీ సంకల్పించింది. మౌలిక సదుపాయాల కల్పనకు వివిధ పథకాల కింద కేంద్ర నిధులను వినియోగించుకోవాలని భావిస్తోంది. భవ్య కింద 22 పార్కులను అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఈ 22తో పాటు రాష్ట్రంలో ఏర్పాటయ్యే భారీ ప్రాజెక్టులకు అనుసంధానంగా శ్రీకాకుళం, శ్రీసత్యసాయి, అనకాపల్లి జిల్లాల్లో కొత్తగా పారిశ్రామిక పార్కులు అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. దీని కోసం ఇప్పటికే 12 వేల ఎకరాలు సేకరించింది. కొత్తగా జాబితాలో చేరిన మూడు పార్క్‌ల కోసం మరో 8 వేల ఎకరాల సేకరణకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. భవ్య పథకం కింద రూ. 33,600 కోట్లతో దేశ వ్యాప్తంగా వంద పార్కులు అభివృద్ధి చేయాలన్నది కేంద్రం ప్రతిపాదన. ఇందులో మొదటగా 20 పార్కుల అభివృద్ధికి దరఖాస్తులు ఆహ్వానించగా.. రాష్ట్రం నుంచి ఆరింటికి ఏపీఐఐసీ ప్రతిపాదనలు పంపింది. అందులో కేవలం రెండింటికి మాత్రం కేంద్రం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రెండో దశలో 80 పార్కుల కోసం కేంద్రం దరఖాస్తులు ఆహ్వానించగా.. ఈ సారి 16 చోట్ల పార్కుల అభివృద్ధికి వీలుగా ఏపీఐఐసీ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రస్తుతానికి పారిశ్రామిక పార్కులో మౌలిక సదుపాయాల కోసం ఎకరాకు రూ. కోటి చొప్పున కేంద్రం గ్రాంటుగా ఇస్తుంది. ఈ పథకం కింద పార్కుల అభివృద్ధికి 90 శాతం భూములు సేకరించాలన్న నిబంధన ఉండటంతో ఇప్పటికే ఏపీఐఐసీ 22 పార్కులకు 12 వేల ఎకరాలను సేకరించింది. ఈ 22తో పాటు మరో మూడు పార్కుల అభివృద్ధికి కూడా ఏపీఐఐసీ ప్రతిపాదనలు రూపొందించడం విశేషం. శ్రీకాకుళం జిల్లా మూలపేట, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి, అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేయనున్న మూడు పార్క్‌ల ద్వారా మరో 8 వేల ఎకరాలను పారిశ్రామిక అవసరాల కోసం అందుబాటులోకి తేవాలని ఏపీఐఐసీ భావిస్తోంది.

## బిజినెస్

### భారతీయ జీడీపీ వృద్ధి రేటు 7.8 శాతం.. ఆర్బీఐ అంచనాలకు మించి నమోదు




భారత జీడీపీ (స్థూల దేశీయోత్పత్తి) వృద్ధిరేటు అంచనాలను మించింది. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది ఆర్బీఐ అంచనాలకంటే అధికం. ఆర్బీఐ 7 శాతం వృద్ధినే అంచనా వేయగా.. 7.8 శాతం వృద్ధి రేటు నమోదైంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో, తొలి త్రైమాసికం అయిన ఏప్రిల్-జూన్ నెలల్లో భారత జీడీపీ అంచనాల వివరాల్ని కేంద్రం సోమవారం వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా అసాధారణ పరిస్థితులు ఉన్నప్పటికీ ఇండియా గణనీయమైన వృద్ధి సాధించిందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు శాఖ ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో జీడీపీ రూ.75.46 లక్షల కోట్లుగా ఉండగా.. ఈ ఏడాది రూ.81.36 లక్షల కోట్లు అంచనా వేసినట్లు తెలిపింది. ప్రస్తుత ధరల ప్రకారం జీడీపీ లేదా నామినల్ జీడీపీ అంచనా రూ.88.27 లక్షల కోట్లుగా ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరం ఇదే మొదటి త్రైమాసికంలో జీడీపీ విలువ రూ.80 లక్షల కోట్లుగా నమోదైంది. దీంతో ఇప్పుడు 10.3 శాతం వృద్ధిని కనబర్చింది. గ్రాస్ వాల్యూ యాడెడ్ కూడా వృద్ధిని నమోదు చేసింది.

### నష్టాల్లో ముగిసిన సూచీలు.. సెన్సెక్స్ 307 పాయింట్లు డౌన్

**ముంబయి:** దేశీయ స్టాక్‌మార్కెట్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు సూచీలపై మరోసారి ప్రభావం చూపాయి. అమెరికా- ఇరాన్ పరస్పరం దాడులకు దిగడం, క్రూడాయిల్ ధరలు మళ్లీ పెరగడం సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీంతో అంతర్జాతీయ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలు నష్టపోయాయి. ముఖ్యంగా ఐటీ, మెటల్, రియల్టీ, మీడియా షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 77,130.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,264.51) వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 76,751.32 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 307.24 పాయింట్ల నష్టంతో 76,957.27 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 95.25 పాయింట్ల నష్టంతో 24,080.40 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.22గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో అదానీ పోర్ట్స్, ఐటీసీ, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. సన్‌ఫార్మా, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.31 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4,451 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# పసిడి ప్రియులకు షాక్.. రూ.12,500 పెరిగిన గోల్డ్ రేటు!

బంగారం ధరలు ఊహకందని రీతిలో విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో పసిడి ధరల్లో గణనీయమైన మార్పు కనిపిస్తోంది. ఆగస్టు 01న రూ.1,44,220 వద్ద ఉన్న గోల్డ్ రేటు, ఈ రోజుకు (ఆగస్టు 31) రూ.1,56,770 వద్దకు చేరింది. దీన్నిబట్టి చూస్తే.. నెల రోజుల్లో పసిడి ధరల్లో ఎంత మార్పు జరిగిందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. ఈ నెల (ఆగస్టు) ప్రారంభంలో హైదరాబాద్, విజయవాడలలో రూ.1,44,220 వద్ద ఉన్న 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు, ఆగస్టు 31కి రూ.1,56,770 వద్దకు చేరింది. అంటే నెల రోజుల్లో రూ.12550 పెరిగిందన్నమాట. 22 క్యారెట్ల రేటు రూ.1,32,200 నుంచి రూ.1,43,700 (రూ.11,500 పెరిగింది) వద్దకు చేరింది. ఢిల్లీ కూడా బంగారం ధరలలో చాలా మార్పులు జరిగాయి. ఇక్కడ నెల ప్రారంభంలో రూ.1,32,350 వద్ద ఉన్న 22 క్యారెట్ల గోల్డ్ రేటు నేటికి రూ.1,43,700 (రూ.11350 పెరిగింది) వద్దకు చేరింది. 24 క్యారెట్ల రేటు రూ.1,44,370 నుంచి రూ.1,56,770 (రూ.12400 పెరిగింది) వద్దకు చేరింది. ఇక వెండి ధరల విషయానికి వస్తే.. కేజీ సిల్వర్ రేటు 30 రోజుల్లో రూ.2.35 లక్షల నుంచి రూ.2.60 లక్షలకు చేరింది. అంటే నెల రోజుల్లో 25000 రూపాయలు పెరిగింది. ఈ ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత



పరిస్థితులు చూస్తుంటే.. పెరిగే అవకాశం ఉందని స్పష్టంగా అర్థమైపోతుంది.

# ఇంటర్నెట్ లేకున్నా.. యూపీఐ చెల్లింపులు

ఫీచర్ ఫోన్ వినియోగదారుల కోసం ప్రముఖ ఫిన్‌టెక్ సంస్థ ఫోన్‌పే ప్రత్యేక సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఇంటర్నెట్ లేకపోయినా వారు యూపీఐ చెల్లింపులు చేసేందుకు వీలుగా సర్వీస్‌ను ఆవిష్కరించింది. దీంతో 20 కోట్ల మందికి పైగా ఫీచర్ ఫోన్ వినియోగదారులు డిజిటల్ చెల్లింపులు చేసేందుకు వీలు కలగనుంది. 2జీ కనెక్టివిటీ ఉన్న ప్రాంతాల్లో నమ్మకమైన లావాదేవీలు నిర్వహించేందుకు ఎస్ఎంఎస్ ఆధారిత వ్యవస్థను ఈ యూపీఐ123పే ఉపయోగించుకుంటుంది. ఈ సర్వీస్‌ను విస్తరించేందుకు నోకియా, హెచ్ఎండీ, లావా ఇంటర్నేషనల్, ఐటెల్ మొబైల్ సంస్థలతో ఫోన్‌పే భాగస్వామ్యం కుదుర్చుకుంది. ప్రీ బండిల్డ్‌గా.. అంటే ఫోన్ కొనుగోలు చేసేటప్పుడు ఫోన్‌తో పాటే వస్తుంది. ఏథర్ నుంచి మరో ఎలక్ట్రిక్ స్కూటర్.. రూ.లక్షకే 'కోణార్క్'

"స్మార్ట్‌ఫోన్‌లకే పరిమితమైన డిజిటల్ చెల్లింపులు 'ఖూ× 123ఖూఐ' సర్వీస్ ద్వారా దేశంలోని ప్రతి మూలకూ విస్తరిస్తాయి" అని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ అన్నారు. అందరికీ సమానస్థాయిలో సేవలు అందించే ఉద్దేశంతోనే దీనిని తీసుకొచ్చామన్నారు. దీనిద్వారా యూజర్లు వ్యక్తులకు, వ్యాపారులకు చెల్లింపులు చేయొచ్చని పేర్కొన్నారు. కెమెరా



కలిగిన ఫీచర్ ఫోన్ వినియోగదారులు స్కాన్ చేసి చెల్లింపులు చేయొచ్చు. కేవలం చెల్లింపులే కాకుండా బ్యాలెన్స్ తనిఖీ చేయడం, లావాదేవీ హిస్టరీ కూడా తెలుసుకోవచ్చు. తొలిసారి ఈ సదుపాయాన్ని వినియోగించే వారి కోసం ఏఐ హెల్ప్‌లైన్‌ను కూడా ఫోన్‌పే అందుబాటులోకి తెచ్చింది. ఇంగ్లిష్ సహా 1[illegible] భారతీయ భాషల్లో ఈ సేవల్ని వినియోగించాలో వివరిస్తుంది. భవిష్యత్‌లో బిల్లు పేమెట్లు, రీఛార్జీ వంటి సేవలను అందుబాటులోకి తెస్తామని ఫోన్‌పే తెలిపింది.

# మంధాన కెరీర్‌లో మరో మైలురాయి.. అత్యధిక పరుగులతో రెండో ర్యాంక్..!

అంతర్జాతీయ క్రికెట్‌లో భారత ఓపెనర్ స్మృతి మంధాన( రికార్డుల మోత మోగిస్తోంది. మూడు ఫార్మాట్లలో కలిపి మూడొందలకు పైగా మ్యాచ్‌లు ఆడిన మంధాన.. అత్యధిక పరుగుల జాబితాలో రెండో ర్యాంక్ సాధించింది. మహిళల ఆసియాకప్ తొలి మ్యాచ్‌లో థాయ్‌లాండ్‌పై 19 పరుగులు చేసిన ఈ లెఫ్ట్ హ్యాండర్ న్యూజిలాండ్ దిగ్గజం సుజీ బేట్స్‌ను దాటేసింది. అంతర్జాతీయంగా మహిళల క్రికెట్‌లో 10,756 రన్స్‌తో మంధాన రెండో స్థానంలో నిలిచింది. భారత ఓపెనర్ స్మృతి మంధాన రికార్డుల హోరు కొనసాగుతోంది. ఈమధ్యే లార్డ్స్ టెస్టుతో మూడొందల అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన మంధాన.. అర్ధ శతకంతో చెలరేగింది. 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన లార్డ్స్ మైదానంలో నిర్వహిస్తున్న మొట్టమొదటి మహిళల టెస్టులో తొలి ఫిఫ్టీ మంధాన నమోదు చేయడం విశేషం. మూడు ఫార్మాట్లలో అదరగొడుతున్న ఓపెనర్.. మరో రికార్డు పట్టేసింది. అంతర్జాతీయంగా అత్యధిక పరుగులు చేసిన రెండో మహిళగా అవతరించింది. దుబాయ్ వేదికగా జరుగుతున్న మహిళల ఆసియా కప్‌లో థాయ్‌లాండ్‌పై 19 రన్స్ చేసిన మంధాన.. సుజీ బేట్స్(న్యూజిలాండ్ మాజీ క్రికెటర్)ను వెనక్కి నెట్టేసింది. ప్రస్తుతం మంధాన ఖాతాలో10,756 పరుగులు ఉండగా.. భారత్‌కే చెందిన మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్10,868 రన్స్‌తో అగ్రస్థానంలో ఉంది. ఇప్పటివరకూ 9 టెస్టుల్లో 788 పరుగులు, 120 వన్డేల్లో 5,411 రన్స్, 172 టీ20ల్లో 4,557 పరుగులు చేసిందీ మంధాన.

**వన్డేల్లో వెయ్యి పరుగులతో**



నిరుడు వన్డేల్లో వెయ్యి పరుగులతో చెలరేగిన మంధాన.. ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును బద్దలు కొట్టింది. ఆసీస్ వెటరన్ అయిన క్లార్క్ 1997లో 970 రన్స్‌తో చరిత్ర సృష్టించింది. అప్పటినుంచి .. దాదాపు 27 ఏళ్లుగా చెక్కు చెదరని రికార్డును మంధాన బ్రేక్ చేసింది. మొత్తంగా 18 ఇన్నింగ్స్‌ల్లో మంధాన 59.00 సగటుతో 1,062 పరుగులు సాధించింది. అంతేకాదు వన్డేల్లో ఒక ఏడాదిలో అత్యధిక పరుగుల రాణుల జాబితాలో మంధాన టాప్‌లో కొనసాగుతుండగా.. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వొల్వార్ట్ 2022లో 882 రన్స్‌తో మూడో స్థానంలో ఉంది. డెబ్బీ హాక్లే (న్యూజిలాండ్) 1997లో 880 రన్స్‌తో నాలుగో స్థానంలో నిలవగా.. 2016 లో ఆ దేశానికే చెందిన అమీ సటెర్‌వైటీ 853 పరుగులతో ఐదో స్థానం దక్కించుకుంది.

### ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్యాన్ని వదులుకోం.. శ్రీలంక క్రికెట్..!



మొట్టమొదటి మహిళల చాంపియన్స్ ట్రోఫీ వేదికపై అనిశ్చితి కొనసాగుతుంది. శ్రీలంక నుంచి టోర్నీని తరలించేందుకు ఐసీసీ సిద్ధమైన నేపథ్యంలో మరి ఎక్కడ నిర్వహిస్తారు? అనేది ఆసక్తికరంగా మారింది. ఈ పరిస్థితుల్లో లంక తాత్కాలిక ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ మాత్రం అరంగేట్రం సీజన్ ఆతిథ్య హక్కులను ఎట్టిపరిస్థితుల్లోనే వదులుకునేందుకు సిద్ధంగా లేమని అంటోంది.. ఎలాగైనా సరే ఈ మెగా ఈవెంట్‌ను తమ దేశంలో జరిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోనుందీ కమిటీ. శ్రీలంక క్రికెట్‌పై అసంతృప్తితో మహిళల ఛాంపియన్స్ ట్రోఫీని వేరే దేశంలో నిర్వహించేందుకు ఐసీసీ ఆలోచిస్తోంది. వేదిక తరలింపు అంశం తెరపైకి రావడంతో అప్రమత్తమైంది లంక క్రికెట్. ఇది అరంగేట్రం సీజన్ కావడంతో ఎలాగైనా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాత్కాలిక ట్రాన్స్‌ఫర్మేషన్ కమిటీ గట్టిగా ప్రయత్నిస్తోంది. అందుకోసం అత్యవసరంగా సంస్కరణలకు సిద్ధమవుతోంది. తాము ఐసీసీని ఒప్పించి మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ అరంభ సీజన్‌ను లంకలోనే జరిగేలా చూస్తామని మధ్యంతర కమిటీ చైర్మన్ ఎరాన్ విక్రేమరత్నా తెలిపాడు. 'శ్రీలంక క్రికెట్‌లోని లోపాలను పునాది నుంచి సరి చేసేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. ఈ విషయంలో మేము వెనక్కి తగ్గం. శ్రీలంక క్రికెట్‌లో ప్రభుత్వ జోక్యం చేసుకుంటున్న అంశాలను ఐసీసీ మా దృష్టికి తీసుకురాలేదు. కాబట్టి.. మేము తీసుకుంటున్న చర్యలను వివరించి.. మా దేశంలోనే టోర్నీ జరిపేలా ఐసీసీని ఒప్పిస్తాం' అని మధ్యంతర కమిటీ సభ్యుడు ప్రకాశ్ షఫ్టెర్ వెల్లడించాడు. ఇదే కమిటీలో సభ్యుడైన కుమార సంగక్కర(ఖఱఖఱతీఖ ఞఖఅస్త్రఖఎిఖఱతీఖ) మాట్లాడుతూ.. ఐసీసీతో బలమైన అనుబంధం కొనసాగించాలని అభిప్రాయపడ్డాడు. 'శ్రీలంక క్రికెట్‌కు కొత్త రాజ్యాంగం తీసుకొస్తున్నాం. ఆ తర్వాత ఎన్నికలు నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకుంటాం' అని సంగక్కర పేర్కొన్నాడు.

## స్పోర్ట్స్

### మళ్లీ తెరపైకి 'ఇంపాక్ట్ రూల్'.. ఫ్రాంచైజీల అభిప్రాయం కోరిన బీసీసీఐ.!



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో హాట్‌టాపిక్ అయిన 'ఇంపాక్ట్ రూల్' మళ్లీ తెరపైకి వచ్చింది. మూడేళ్లుగా వివాదాస్పదంగా మారిన ఈ నియమంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి తాజాగా ఫ్రాంచైజీల అభిప్రాయం కోరింది. ప్రతి సీజన్‌లో ఈ నిబంధనను కొందరు ఆటగాళ్లు విమర్శిస్తుండగా.. మరికొందరు మద్దతిస్తున్నందున ఇంపాక్ట్‌పై తమతమ ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తెలిపింది బీసీసీఐ. ఈ అంశంతో పాటు మరిన్ని విషయాలపై కూడా పది జట్ల యాజమాన్యం అభిప్రాయాలను కోరింది భారత బోర్డు. ఐపీఎల్‌లో ఆల్‌రౌండర్ల పాలిట శాపంలా మారిన ఇంపాక్ట్ నిబంధనపై బీసీసీఐ అభిప్రాయ సేకరణకు సిద్ధమైంది. రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, శుభ్‌మన్ గిల్ వంటి స్టార్లు ఈ నియమంపై వ్యతిరేకత వ్యక్తం చేసినందున.. మరో సీజన్‌లో దీన్ని ఉంచాలా? వద్దా? అనేదానిపై బీసీసీఐ ఆలోచిస్తోంది. ఈ క్రమంలోనే ఈ మెగా లీగ్‌కు ప్రత్యేక ఆకర్షణగా 2023లో ప్రవేశ పెట్టిన ఈ నియమంపై తమ నిర్ణయాన్ని తెలపాలని ఫ్రాంచైజీలను కోరింది బీసీసీఐ. అంతేకాదు ప్లేయర్లు.. మ్యాచ్ అధికారులు ప్రాంతం అంపైరింగ్, ప్రాక్టీస్ సెషన్.. ఆటకు అనువైన పరిస్థితులు.. వీటిపై కూడా ఫ్రాంచైజీల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకోనుంది. ఆగస్టు 31, సోమవారం లోగా తమ స్పందన తెలియజేయాలని పది జట్లకు గడువు విధించింది బీసీసీఐ. ఫ్రాంచైజీల నుంచి అందిన రివ్యూలను బట్టి వచ్చే సీజన్‌లో అవసరమైన చర్యలు తీసుకోనుంది బోర్డు. అలానే 19వ సీజన్‌లో విమర్శలకు కేంద్రంగా మారిన ప్లేయర్లు, మ్యాచ్ అధికారుల ప్రాంతంలోకి ఇతరుల ప్రవేశంపై కూడా బీసీసీఐ కఠినమైన చర్యలు తీసుకోనుంది.

## సంపాదకీయం

# రిజర్వేషన్ల రగడ..!

ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జరిగిన ప్రదర్శనలో బాబాసాహెబ్ అంబేద్కర్ గురించి చర్చతోపాటు 'జై భీమ్' నినాదాలు మార్మోగిన కొద్ది రోజులకే, అదే వేదికపై పూర్తి భిన్నమైన స్వరం వినిపించింది. 'రిజర్వేషన్ హటావో ఆందోళన' పేరిట రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కొత్త ఉద్యమం మొదలైంది. ఈ పరిణామంతో దేశ రాజకీయాల్లో రిజర్వేషన్లపై చర్చ మరోసారి కేంద్రబిందువుగా మారింది. అయితే, అధికార బీజేపీకి ఇది కేవలం విధానపరమైన చర్చ మాత్రమే కాదు, ఎదుర్కోవాల్సిన పెద్ద రాజకీయ సవాలుగా మారింది. ఒకవైపు పార్టీకి దీర్ఘకాలంగా మద్దతిస్తున్న సాధారణ కేటగిరీ (జనరల్ కేటగిరీ) వర్గంలో అసంతృప్తి పేరుకుపోగా, మరోవైపు గత దశాబ్దకాలంలో పార్టీ తన సామాజిక పునాదిని విస్తరించుకున్న ఇతర వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలున్నాయి. మరికొన్ని నెలల్లో ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో, తన మద్దతుదారుల్లో ఏ ఒక్క వర్గాన్నీ దూరం చేసుకోకుండా ఈ కొత్త డిమాండ్లకు ఎలా స్పందించాలన్నదే బీజేపీ ముందున్న అసలైన ప్రశ్న! అన్‌రిజర్వ్‌డ్ కులాల ఆందోళనలను పరిష్కరిస్తూనే ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల్లో తన మద్దతును పార్టీ నిలుపుకోగలదా? లేక ఒక వర్గానికి భరోసా కల్పించే ప్రయత్నం మరో వర్గంలో అభద్రతా భావాన్ని సృష్టిస్తుందా? అన్నది ఆసక్తికరమైన ప్రశ్నగా నిలిచింది.

2014లో మోదీ శకం ప్రారంభమైనప్పటి నుంచి బీజేపీ ఒక విస్తృత కుల ఆధారిత కూటమిని నిర్మించుకుంది. అంతకుముందు లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓట్ల వాటా దాదాపు 22 శాతం ఉంటే, అది క్రమంగా 37 శాతానికి పెరిగింది. సంప్రదాయ ఓటర్లైన అగ్రకులాలను దాటి పార్టీ తన మద్దతును గణనీయంగా విస్తరించుకున్నట్టు ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. అగ్రకులాల ప్రయోజనాలను కాపాడేది తామేనని ఒకప్పుడు భావించిన ఆ వర్గాలు, పార్టీ విస్తృత కుల కూటమిని నిర్మించుకుంటున్న క్రమంలో తమను పక్కనబెడుతున్నారన్న భావనకు లోనవుతున్నట్టు కనిపిస్తోంది. మోదీ శకం మొదలైన తర్వాత బీజేపీ ప్రధాన ఓటు బ్యాంకులో ఇలాంటి కదలిక కనిపించడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్నవారు పార్టీ అధిష్ఠానాన్ని కలిసినా, మెరిట్ ఆధారిత రిజర్వేషన్ల డిమాండ్‌కు బీజేపీ బహిరంగంగా మద్దతు ఇవ్వలేకపోతోంది. ఎందుకంటే అలా చేస్తే తాను జాగ్రత్తగా నిర్మించుకున్న ఓబీసీ ఓటు బ్యాంకును కోల్పోయే ప్రమాదముంది. ఇదే సమయంలో, నిరసన తెలుపుతున్న అగ్రకులాల వర్గాలకు ఒక స్పష్టమైన రాజకీయ నాయకత్వం లేకపోవడం గమనార్హం. యువతలో ఉద్యోగావకాశాల కొరత, నాణ్యమైన విద్యకు సంబంధించిన ప్రశ్నలు ముందుకు వస్తున్నా, వీటిని అందిపుచ్చుకుని ఒక నిర్దిష్ట దిశలో నడిపించే ప్రతిపక్ష నాయకత్వం కొరవడటంతో, ఈ ఉద్యమం రాజకీయ అస్థిరతకు సంకేతంగానే మిగిలిపోతోంది. సోషల్ మీడియా ద్వారా ఏర్పడిన ఈ ఉద్యమం ఏ దిశగా పయనిస్తుందో, దాని నుంచి ఉద్భవించే రాజకీయ శక్తి ఎటువైపు మొగ్గుతుందో, రాబోయే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరమే స్పష్టం కానుంది.

రిజర్వేషన్ల నిర్మూలనపై జరుగుతున్న చర్చలో లేవనెత్తుతున్న ప్రధాన వాదనల్లో ఒకటి.. ఆర్థికంగా అభివృద్ధి చెందిన దళితులకు ఇకపై రిజర్వేషన్లు అవసరం లేదన్నది. అయితే, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రిజర్వేషన్లు వారి ఆర్థిక పరిస్థితి ఆధారంగా మంజూరు కాలేదన్న విషయాన్ని ఈ వాదన విస్మరిస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రిజర్వేషన్ల నిర్మూలన గురించి చర్చించాలంటే, అది కేవలం ఆర్థిక స్థితిపైనే ఆధారపడకూడదని, సమాజంలో ఆయా వర్గాల స్థానం, గౌరవం, ప్రాతినిధ్యం, న్యాయంవంటి విస్తృత అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఆర్థికంగా వెనుకబడిన అగ్రకులాల వారికి ఇప్పటికే ప్రభుత్వం ఈడబ్ల్యూఎస్ కేటగిరీని ఏర్పాటు చేసిందని, ప్రతి వర్గం తనకు కేటాయించిన కేటగిరీలోనే పోటీపడాల్సి ఉంటుందని కూడా గుర్తుచేస్తున్నారు. అదే సమయంలో, ఒకే షెడ్యూల్డ్ కులాల వర్గంలోనూ కొన్ని ఉపకులాలు ఎక్కువ రాజకీయ ప్రాతినిధ్యాన్ని పొందుతుండగా, మరికొన్ని ఉపకులాలు ఇప్పటికీ వెనుకబడే ఉండటం మరో సంక్లిష్ట సమస్యగా ముందుకు వస్తోంది. దీనిపై సమగ్ర అధ్యయనం, శ్వేతపత్రం అవసరమన్న డిమాండ్ బలపడుతోంది. వర్సిటీల్లో వైస్ చాన్సలర్ల పదవుల నుంచి న్యూస్‌రూమ్‌ల వరకు, నిర్ణయాధికార స్థానాల్లో అణగారిన వర్గాల ప్రాతినిధ్యం ఇప్పటికీ చాలా తక్కువగానే ఉందని, తాము కేవలం సంక్షేమ ప్రయోజనాలు పొందేవారిగా మిగిలిపోకుండా, నిర్ణయాధికార వ్యవస్థల్లో భాగస్వాములవ్వాని కోరుకుంటున్నామన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇటీవలి యూజీసీ నిబంధనలు కొంతమేర అసంతృప్తికి, రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమానికి కారణమయ్యాయని చెబుతున్నా, దళిత విద్యార్థుల పీహెచ్‌డీ థీసిస్‌ల సమర్పణలో తరచూ ఎనిమిదేళ్ల వరకు జాప్యం జరుగుతుండటం, ఇంటర్వ్యూల్లో ఈ వర్గాలకు తక్కువ మార్కులు లభిస్తుండటం వంటి వాస్తవ సమస్యలను పరిష్కరించే దిశగా యూజీసీ నోటిఫికేషన్ ఒక ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను, కమిటీని ఏర్పాటు చేసిందని, ఇందులో అన్ని వర్గాల ప్రతినిధులూ భాగస్వాములుగా ఉంటారని కూడా వివరిస్తున్నారు.

ఆధునికత రాకతో రోజువారీ జీవితంలో కులవివక్ష తగ్గుతున్నట్టు కనిపిస్తున్నా, ఎన్నికల ప్రజాస్వామ్యం మాత్రం కుల గుర్తింపును మరింత బలోపేతం చేస్తుండటం పెద్ద వైరుధ్యంగా నిలుస్తోంది. నేటి యువతరం రోజువారీ జీవితంలో, స్నేహితుల మధ్య కులాన్ని పెద్దగా పట్టించుకోకపోయినా, రాజకీయ అంశం ముందుకు వచ్చిన వెంటనే కుల గుర్తింపు మళ్లీ తెరపైకి రావడం గమనార్హం. రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమంలో పదేపదే వినిపిస్తున్న 'మెరిట్' అనే పదం కూడా అత్యంత సాపేక్షమైనదని, దీనికి కులంతో అనివార్యంగా సంబంధం ఉండాల్సిన అవసరం లేదని, ఇది వ్యక్తిగత సామర్థ్యానికి సంబంధించిన అంశం కూడా అని విశ్లేషకులు గుర్తుచేస్తున్నారు. అసలు సమస్య పెరుగుతున్న సామాజిక అసమానతేనని, సమాజం నిరంతరం మారుతూ ఉంటుంది కాబట్టి ఈ అసమానతలకూ కొత్త కొత్త అర్థాలు వస్తుంటాయని అభిప్రాయపడుతున్నారు. మొత్తంమీద, రిజర్వేషన్లపై ప్రస్తుతం జరుగుతున్న చర్చ, కేవలం విధానపరమైన సమస్య మాత్రమే కాదు, సామాజిక న్యాయం, రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక అసమానతల మధ్య సున్నితమైన సమతూకాన్ని సాధించాల్సిన సంక్లిష్ట సవాలుగా మిగిలిపోతోంది. ఏ వర్గానికీ అన్యాయం జరగకుండా, అదే సమయంలో దశాబ్దాలుగా అణచివేతకు గురైన వర్గాలకు నిజమైన సాధికారత లభించేలా చూడటమే, భవిష్యత్తులో ఈ చర్చకు సరైన పరిష్కారాన్ని అందించగలదు.

## పనికొచ్చే పలుకు



# సహనమే.. శ్రీరామ రక్ష

ఇంటర్నెట్ మన జీవితాలను సులభతరం చేయడమే కాకుండా, మన అలవాట్లను, ఓర్పునూ మార్చేసింది. ఒకప్పుడు ఎవరితోనైనా మాట్లాడాలంటే ఓపికగా ఉండేవాళ్లం. ఉత్తరం రాయాలంటే వారాలు పట్టేది. తిరిగి జవాబు రావాలంటే.. మరిన్ని వారాలు ఎదురు చూడాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు రిప్లై ఆలస్యమైతేనే ఏదో జరిగిపోయిందని కంగారు పడుతున్నాం. ఖాళీ దొరికితే చాలు ఆటోమేటిక్‌గా ఫోన్ చూస్తున్నాం. సమాచారం, వినోదం ఇలా ప్రతిదీ వెంటనే రావాలనుకోవడం మనలోని సహనం అనే గొప్ప గుణాన్ని పూర్తిగా తగ్గించేస్తోంది. రచయిత్రి జాయిస్ మేయర్ చెప్పిన ఒక ప్రసిద్ధ మాట ఇక్కడ గుర్తుచేసుకోవాలి: *Patience is not the ability to wait, but the ability to keep a good attitude while waiting.* అంటే, ఓపిక అంటే కేవలం వేచి చూడగలగడం కాదు, వేచి చూస్తున్నప్పుడు మంచి మనోభావాన్ని కొనసాగించగలగడం. కానీ మనం కొద్దిపాటి వేచి చూడాల్సిన సమయంలోనూ ఆందోళన, చిరాకు, అసహనానికి లోనవుతున్నాం. అంటే, సమస్య వేచి చూడటంలో లేదు, వేచి చూసేటప్పుడు మన మనసు ఎలా స్పందిస్తుందన్నదే అసలైన సవాలు. ఈ మార్పు వెనుక ఉన్న శాస్త్రీయ కారణాన్ని అర్థం చేసుకోవడం ముఖ్యం. ప్రతిసారీ నోటిఫికేషన్ వచ్చినప్పుడు, మెసేజ్‌కు రిప్లై వచ్చినప్పుడు, మన మెదడులో డోపమైన్ అనే 'ఆనంద హార్మోన్' విడుదలవుతుంది. ఇది మళ్లీ మళ్లీ ఫోన్ చూడాలని కోరుకునేలా చేస్తుంది. దీర్ఘకాలంలో ఇది మెదడు నిర్మాణాన్నే మారుస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. నిదానంగా ఆలోచించే సామర్థ్యం తగ్గి, తక్షణ సంతృప్తి కోసం అర్రులు చాచే ధోరణి పెరుగుతుంది. దీన్నే మనస్తత్వశాస్త్రంలో 'ఇన్‌స్టంట్ గ్రాటిఫికేషన్ ట్రాప్' అంటారు. ఈ మార్పు మన జీవితంపై చూపే ప్రభావం అనేక రూపాల్లో కనిపిస్తుంది. సంబంధాల్లో, ఎవరైనా మెసేజ్‌కు వెంటనే స్పందించకపోతే ప్రతికూల అర్థాలు తీసుకుంటాం. "నన్ను పట్టించుకోవడం లేదు", "ఏదో తప్పు జరిగింది" అని ఆందోళన చెందుతాం. ఎందుకంటే మనసు తక్షణ ఫలితాల కోసం ఆరాటపడుతుంది. వ్యక్తిగత ఎదుగుదలలో, నైపుణ్యాలు నేర్చుకోవడానికి, అలవాట్లను మార్చుకోవడానికి అవసరమైన సమయాన్ని ఇవ్వకుండా, వెంటనే ఫలితాలు కనిపించకపోతే మధ్యలోనే వదిలేస్తాం.

ఈ పరిస్థితిని మార్చుకోవడానికి కొన్ని ఆచరణాత్మక మార్గాలు ఉన్నాయి. మొదటిది.. రోజులో కొన్ని నిర్దుష్ట సమయాల్లో మాత్రమే ఫోన్ నోటిఫికేషన్లను చూడండి. నిరంతరం అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం లేదని మీ మెదడుకు నేర్పించండి. రెండోది.. ఉద్దేశపూర్వకంగా వేచి చూసే అభ్యాసం చేయండి. క్యూలో నిలబడినప్పుడు వెంటనే ఫోన్ తీయకుండా, చుట్టూ ఉన్న ప్రపంచాన్ని గమనించండి. మూడోది.. దీర్ఘకాలిక లక్ష్యాలను చిన్న మైలురాళ్లుగా విభజించి, ప్రతి చిన్న పురోగతినీ జరుపుకోండి. ఇది తక్షణ సంతృప్తి కోరికను ఆరోగ్యకరమైన రీతిలో తీర్చుతుంది. నాలుగోది, రోజుకు కొంత సమయం పూర్తిగా డిజిటల్ పరికరాలకు దూరంగా గడపండి –పుస్తకం చదవడం, నడక వంటివి మెదడుకు నిదానంగా ఆలోచించే అలవాటును తిరిగి నేర్పిస్తాయి. గుర్తుంచుకోండి –ఓపిక పుట్టుకతో వచ్చే గుణం కాదు, అభ్యాసంతో సాధించే నైపుణ్యం. ఇంటర్నెట్ మనకు వేగాన్ని ఇచ్చినా, జీవితంలో నిజంగా విలువైనవన్నీ – మంచి సంబంధాలు, లోతైన జ్ఞానం, స్థిరమైన విజయం – సమయం తీసుకునేవే. వేచి చూడాల్సిన క్షణాల్లో మీ మనోభావాన్ని ప్రశాంతంగా ఉంచుకోగలిగితే, అదే మీ నిజమైన శక్తిగా మారుతుంది.

# నేపాల్ వేదన.. భారత్‌కు హెచ్చరిక!


**ఇప్పుడైనా భారత్ నేర్చుకుంటుందా? తన బాధను నేపాల్ చెబుతున్నప్పటికీ, ఇన్నాళ్లూ వినడానికి నిరాకరించిన ఆ గుణపాఠాన్ని ఇకనైనా వినగలదా? హిమాలయాలు వేర్వేరు దేశాల ప్రత్యేక భాగాలు కాదు - అఫ్ఘానిస్తాన్ నుంచి భూటాన్ వరకు, ఇవన్నీ ఒకే సజీవ శిల, భూకంప శక్తులతో, హిమానీనద కదలికలతో నిండి ఉన్న ప్రమాదకర నిర్మాణం. ఆగస్టు 27న నేపాల్‌లో సంభవించిన విషాదం, ఎగువన జరిగింది దిగువన జరిగితే భారత్ సన్నద్ధత సరిపోతుందా అన్న ప్రశ్నను లేవనెత్తుతోంది. చైనా నిర్మిస్తున్న మెడోగ్ జలవిద్యుత్ ప్రాజెక్టు, భూకంప ప్రమాదకర పైజెన్ ఫాల్ట్‌కు అత్యంత సమీపంలో ఉండటం, ఈశాన్య భారత్‌కు మరో పెను ముప్పుగా మారే అవకాశం ఉంది. చిన్న పొరుగుదేశం చెల్లించిన మూల్యం నుంచి నేర్చుకోకపోతే, రేపు అదే అద్దంలో భారత్ కూడా కనిపించే ప్రమాదం ఉంది.**



ఇప్పుడైనా భారత్ నేర్చుకుంటుందా? తన బాధను నేపాల్ చెబుతున్నప్పటికీ, ఇన్నాళ్లూ వినడానికి నిరాకరించిన ఆ గుణపాఠాన్ని ఇకనైనా భారత్ వినగలదా? హిమాలయాలు వేర్వేరు ప్రత్యేక భాగాలుగా విడిపోయినవి కావు. అఫ్ఘానిస్తాన్ హిందూకుష్ హిమాలయాలు, పాకిస్తాన్ హిమాలయాలు, భారత హిమాలయాలు, నేపాల్ హిమాలయాలు, టిబెట్–చైనా, భూటాన్‌లోని హిమాలయాలు.. ఇవన్నీ ఒకే సజీవ శిల. నిశ్శబ్దంగా, గంభీరంగా, భూకంప శక్తులతో, హిమానీనద కదలికలతో, భౌగోళిక అలజడులతో నిండివున్న ఒకే ఒక్క సజీవ నిర్మాణమిది. ఎప్పుడు, ఎక్కడ, ఎంత తీవ్రతతో దాడి చేస్తుందో ఎవరూ ఊహించలేని రీతిలో అది తన మౌన ఆలోచనలను ఆకస్మిక కుదుపులతో వ్యక్తం చేస్తుంది. నదులు తమ మార్గాలనుంచి బలవంతంగా తొలగించబడటం, రాళ్లు, కొండచరియలు విరిగిపడి బురద, పూడికతో మానవ నివాసాలను శిథిలాలుగా, సారవంతమైన పొలాలను బురద మయంగా మార్చేయడం.. ఇలాంటి విపత్తులు అక్కడి నుంచి ఎలా వెలువడతాయో ఎవరూ కచ్చితంగా ఊహించలేరు. 1934 నాటి నేపాల్–బిహార్ భూకంపం లేదా 1950నాటి అస్సాం భూకంపం గురించి తల్లిదండ్రుల నుంచి, తాతల నుంచి విన్నవారిని అడిగితే, ఆ దుఃస్వప్నాన్ని వారు వివరిస్తారు. ఉత్తర భారతదేశంలో పెద్ద భూభాగాన్ని కుదిపేసే సామర్థ్యం గల భారీస్థాయి భూకంపం రాబోతోందని భూకంప శాస్త్రవేత్తలు ప్రపంచానికి, ప్రత్యేకించి భారత్‌కు హెచ్చరించారు. ఈ హెచ్చరికను భారత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కాదు, విపత్తు నిర్వహణ సంస్థలు చెబుతున్నట్టు, ఈ ముప్పుపట్ల అప్రమత్తంగా ఉండటానికి చాలా చేసింది కూడా. కానీ ఆగస్టు 27న నేపాల్‌లో సంభవించిన విషాదం తర్వాత మనం అడగాల్సిన, తెలుసుకోవాల్సిన ప్రశ్న ఏమిటంటే.. ఎగువ నేపాల్‌లో జరిగింది దిగువ నేపాల్‌లో, అంతకంటే దిగువన కూడా జరిగివుంటే, నదీతీర నివాసాలను తక్షణ మృత్యువు నుంచి కాపాడటానికి మన 'సన్నద్ధత' సరిపోయేదా? మరింత సూటిగా చెప్పాలంటే, గ్లోబల్ వార్మింగ్ ప్రేరేపిత హిమానీనద సరస్సు విస్ఫోటన వరదల భయానక దృగ్విషయం గురించి, భారత్‌లో అలాంటి ముప్పు ఉన్న ప్రాంతాల్లో నివసించే ప్రజలను అధికారులు హెచ్చరించారా? ఎదుర్కోవడం ఎలాగో సలహా ఇచ్చారా? అన్నది మనం తెలుసుకోవాలి. నిజం చెప్పాలంటే, భూకంప, హిమానీనద, వాతావరణ, భౌగోళిక పరిజ్ఞానం విషయంలో మనం అమాయకంగానే ఉన్నాం. మన భూశాస్త్రవేత్తలకు ఇదంతా తెలుసు, కానీ వారి జ్ఞానం గురు–ముష్టిలో బిగించుకున్నట్టు పరిమితంగానే ఉండిపోతోంది. బుధవారం నేపాల్‌లో ఏం జరిగిందో ఇంకా పూర్తిగా అంచనా వేయాల్సి ఉంది. భూకంపమే జీఎల్‌ఓఎఫ్‌కు కారణమైందా? లేక జీఎల్‌ఓఎఫ్ ఫలితంగానే భూమికంపించి, జలాశయాలు భయానకంగా ఉప్పొంగాయా? అన్నది త్వరలోనే తెలుస్తుంది.

ఏ క్రమంలో జరిగినా, భారత్ నేర్చుకోవాల్సిన గుణపాఠాలు స్పష్టంగా కేకలు వేస్తున్నాయి. మొదటిది.. ఊహ తెలిసినప్పటి నుంచీ పవిత్రంగా భావించే హిమాలయాలు, 'ఖచ్చితమైన' ప్రమాదాన్నీ గర్భంలో మోస్తున్నాయి. రెండోది.. ఈ ప్రమాదాలను ఇకపై కేవలం సదస్సులు, సాంకేతిక పత్రాలకే పరిమితం చేయకూడదు. మూడోది.. వీటిని యుద్ధప్రాతిపదికన స్పష్టమైన బాధితులమయ్యే మనకు తెలియజేయాలి. నాలుగోది.. కేవలం జ్ఞానాన్ని పెంచడం కాదు, కొత్త రక్షణ వ్యవస్థలో భాగస్వాములను చేయడం ద్వారా తెలియజేయాలి. ఐదోది.. మన పండిత–దౌత్యవేత్త శ్యామ్‌శరణ్ ఇటీవల ద ట్రిబ్యూన్, ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లలో రాసిన రెండు కీలక వ్యాసాల్లో, బ్రహ్మపుత్ర నదికి భారత్ సరిహద్దుకు అవతల, పైజెన్ ఫాల్ట్‌కు అత్యంత సమీపంలో చైనా నిర్మిస్తున్న మెడోగ్ ప్రాజెక్టు (ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టు) గురించి హెచ్చరించారు. ఈ ప్రాంతంలో పెద్ద భూకంపం సంభవిస్తే, ఈశాన్య భారత్‌లోకి భారీ వరద జలాలు, శిథిలాలు వెల్లువెత్తే ప్రమాదముందని ఆయన స్పష్టం చేశారు. చైనా భూవిజ్ఞాన శాస్త్రవేత్తలే ఈ ప్రాజెక్టు స్థలం కింద ప్లీస్టోసీన్ యుగం నుంచి క్రియాశీలంగా ఉన్న పైజెన్ ఫాల్ట్‌ను గుర్తించడం గమనార్హం. చైనాతో సరిహద్దుల్లో పరిణతితో కూడిన సభ్యతను నెలకొల్పాలన్న భారత్ ప్రయత్నాలు, మెడోగ్ ప్రాజెక్టు కలిగించే భయానక ప్రమాదం గురించి నిష్కపటమైన చర్చను కూడా ఇప్పుడు తప్పనిసరిగా చేర్చుకోవాలి. ఆరోది.. అధిక–రిస్క్ మండలాల్లో ఉన్న ఆనకట్టలు, రియాక్టర్ల వంటి భారత్ సొంత నిర్మాణ ప్రమాదాలను తక్షణం సమీక్షించి, నిజమైన 'దుష్టశక్తుల'ను తొలగించడం ఇక వాయిదా వేయలేని పని. ఏడోది.. కష్టతరమైనా, అంతే ముఖ్యమైనది, అధిక–రిస్క్ మండలాల్లో మానవ జనావాసాలను క్రమబద్ధంగా, కానీ కాలపరిమితితో కూడిన రీతిలో తగ్గించడం. ఎనిమిదోది.. బాహ్య శత్రువుపై కచ్చితత్వంతో, అతిక్రమణలు లేకుండా సర్జికల్ దాడులు చేయగలిగితే, మన శ్రేయస్సు కోసం ఉద్దేశించినా ఇప్పుడు ప్రమాదంగా మారిన నిర్మాణాలను నిర్వీర్యం చేయడానికి కూడా అలాంటి పౌర సమానమైన చర్యలను వినియోగించాలి.

సీఎఫ్ ఆండ్రూస్, వెరియర్ ఎల్విన్, జేబీఎస్ హాల్డేన్ సంప్రదాయానికి చెందిన బ్రిటిష్ భారత భక్తురాలు మార్జోరీ సైక్స్ ఒకసారి ఆవేశంగా ఇలా అన్నారు: "ఆనకట్టలే శాపం." అన్ని ఆనకట్టలూ శాపం కాకపోవచ్చు, కానీ కొన్ని, వాటి స్థానాన్ని బట్టి, నిజంగానే శాపంగా మారతాయి. అలాగే, కొన్ని రియాక్టర్లు రాక్షసులుగా మారవచ్చు. కొన్ని వాణిజ్య దిగ్గజాలు కూడా దోపిడీపరులుగా మారవచ్చు. ఒక పెద్ద, గొప్ప దేశం తన చిన్న పొరుగుదేశపు అనుభవం నుంచి నేర్చుకోగలదు – ప్రత్యేకించి, రెండు దేశాలూ సమాధిగా మారే ప్రమాదమున్న అదే సజీవ శిలపైనే నిలబడి ఉన్నప్పుడు. నేపాల్ చెల్లించిన మూల్యం భారత్‌కు ఒక అద్దం లాంటిది. దాన్ని చూసి కూడా మనం మారకపోతే, రేపు ఈ అద్దంలో మనమే కనిపించే ప్రమాదం ఉండొచ్చు, చెప్పలేం! ■



ఓటమి ఒక్కోసారి బాధ కలిగించడం సహజమే. అంతకుమించి.. ఓటమిలో ఇతరులు మిమ్మల్ని సరిగా అర్థం చేసుకోకపోవడమే కొన్నిసార్లు ఎక్కువ బాధ కలిగిస్తుంది. నిజానికి -ఓటమి ఎదురైనా తట్టుకొని మళ్లీ నిలబడవచ్చు. గెలుపుకోసం మళ్లీ ఓటమినే ఆయుధంగానూ మలచుకోవచ్చు. కానీ, ఇతరుల మెప్పు కోసం ఎదురుచూస్తే.. నిరంతరం మిమ్మల్ని మీరు మార్చుకుంటూ పోతే.. అది మీ వ్యక్తిత్వాన్నే నెమ్మదిగా చంపేస్తుంది. సో, ఇతరుల కోసం కాకుండా, మీరు నిజంగా నమ్మే దాన్ని నిర్మించుకోవడంపైనే ఎక్కువ దృష్టి కేంద్రీకరించండి.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# బండారం బట్టబయలు!




తైవాన్‌లో ఒక వ్యక్తి తన భార్య వివాహేతర సంబంధాన్ని రోబో వాక్యూమ్ క్లీనర్‌తో రికార్డు చేసినందుకు ఐదు నెలల జైలు శిక్షను ఎదుర్కొన్నాడు. 2021లో వివాహమాడిన ఈ జంట తల్లిదండ్రులతో కలిసి నివసిస్తుండగా, 2023లో వారి సెలవుల ఇంటికి వెళ్లినప్పుడు అనుమానాస్పద టూత్‌బ్రష్ కనిపించడంతో భర్తకు అనుమానం మొదలైంది. మొదట భార్య బుకాయించడంతో నమ్మేసినా, మూడు నెలల తర్వాత ఆమెను ఆశ్చర్యపరచాలని మొబైల్ యాప్ ద్వారా రిమోట్‌గా రోబో వాక్యూమ్ ఆన్ చేయగా, భార్య మరో వ్యక్తితో పడకగదిలో ఉండటం కంటపడింది! తక్షణమే ఎదుర్కోకుండా, న్యాయపరమైన ఆధారంగా ఉపయోగపడేలా రికార్డింగ్ కొనసాగించాడు. ఈ వీడియో ఆధారంగా భార్య, ఆమె ప్రియుడిపై 68,000 డాలర్ల నష్టపరిహారం కోరుతూ కోర్టుకెళ్లగా, న్యాయస్థానం 16,500 డాలర్లు చెల్లించాలని ఆదేశించింది. అయితే, భార్య దాఖలు చేసిన ప్రతి దావాలో, సమ్మతి లేకుండా ప్రైవేటు క్షణాలను రికార్డు చేయడం చట్టవిరుద్ధమని కోర్టు తేల్చడంతో, విజయం అతడికి చేదుగా మారింది. వైవాహిక బాధ్యతలు వ్యక్తిగత గోప్యతా హక్కును అధిగమించలేవని స్పష్టం చేస్తూ, అతడికే ఐదు నెలల జైలు శిక్ష, జరిమానా విధించారు!

# బాలయ్య కొత్త సినిమాకు రెండక్షరాల టైటిల్ ఫిక్స్ సెప్టెంబర్ 6న భారీ ప్రకటన




నందమూరి నటసింహం బాలకృష్ణ, మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న క్రేజీ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. గతంలో 'వీరసింహారెడ్డి' వంటి సూపర్ హిట్ చిత్రాన్ని అందించిన ఈ కాంబినేషన్ మరోసారి చేతులు కలపడంతో.. ఈ సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో మొదటి నుంచే ఉంది. బాలయ్య పుట్టినరోజు సందర్భంగా విడుదలైన గ్లిమ్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. తాజాగా ఈ మూవీకి సంబంధించి మేకర్స్ కీలక అప్డేట్ ఇచ్చారు. సినిమా అధికారిక టైటిల్‌తో పాటు థియేట్రికల్ రిలీజ్ డేట్‌ను సెప్టెంబర్ 6న ప్రకటించనున్నట్లు వెల్లడించారు. దీంతో నందమూరి అభిమానుల్లో ఒక్కసారిగా ఆసక్తి పెరిగింది. కోసం ఇప్పటికే రెండు పవర్‌ఫుల్ టైటిల్స్ పరిశీలనలో ఉన్నట్లు గత కొంతకాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. (దాదా) అనే టైటిల్స్‌లో ఒకదాన్ని సినిమాకు ఖరారు చేసే అవకాశం ఉందని టాక్ వచ్చింది. బాలకృష్ణ మాస్ ఇమేజ్‌కు, గోపీచంద్ మలినేని మార్క్ యాక్షన్ ఎలిమెంట్స్‌కు ఈ రెండు టైటిల్స్ బాగా సెట్ అవుతాయని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు సమాచారం. అయితే ప్రస్తుతం 'దాదా' టైటిల్‌నే దాదాపుగా ఖరారు చేసినట్లు ఇండస్ట్రీలో ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై అధికారిక క్లారిటీ మాత్రం సెప్టెంబర్ 6న రానుంది. ఆ రోజే టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించనుండటంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. గోపీచంద్ మలినేని ఈసారి బాలయ్యను సరికొత్త యాక్షన్ అవతార్‌లో చూపించబోతున్నట్లు తెలుస్తోంది.




## శ్రీవిష్ణు నుంచి మరో కొత్త సినిమా.. కామెడీకి దూరంగా ఎమోషనల్ కథతో వస్తున్న యంగ్ హీరో!

వరుస విజయాలతో మంచి ఫామ్‌లో ఉన్న యంగ్ హీరో శ్రీవిష్ణు మరో కొత్త సినిమాను ప్రకటించారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న శ్రీవిష్ణు.. ఈసారి మాత్రం సరికొత్త ఎమోషనల్ కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొత్త దర్శకుడు సన్నీ సంజయ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. హారికా హాసిని ఎంటర్‌టైన్‌మెంట్స్ అధినేత చినబాబు పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటిస్తూ గ్లింప్స్ విడుదల చేశారు. తాజాగా విడుదలైన గ్లింప్స్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. చిన్నప్పటి నుంచి ఎన్నో కలలు కనే ఓ సాధారణ మధ్యతరగతి అబ్బాయి.. కుటుంబ ఆర్థిక పరిస్థితులు, బాధ్యతల కారణంగా తన ఆశలను పక్కన పెట్టి సాధారణ జీవితాన్ని కొనసాగించే పరిస్థితిని ఇందులో చూపించినట్లు తెలుస్తోంది. మంచి కాలేజీలో చదవాలనే కోరిక ఉన్నా కుటుంబ పరిస్థితుల కారణంగా సాధారణ కాలేజీలో చదవడం.. జీవితంలో ఎన్నో సాధించాలని ఆశించినా కుటుంబ బాధ్యతల కోసం ఉద్యోగం చేయడం.. ఇలా ఎంతోమంది మిడిల్ క్లాస్ యువకుల జీవితాల్లో ఎదురయ్యే పరిస్థితులను ఈ సినిమాలో చూపించబోతున్నట్లు గ్లింప్స్ ద్వారా అర్థమవుతోంది. శ్రీవిష్ణు సినిమాలంటే సాధారణంగా కామెడీ, ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు డిఫరెంట్ కాన్సెప్ట్‌లు గుర్తుకొస్తాయి.



# 'వేట' ఓ గ్రామీణ కథ

అశోక్ కోటిపల్లి దర్శకత్వంలో సందీప్ సరోజ్, సాత్విక జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'వేట'. ఈ మూవీకి సంబంధించిన పూజా కార్యక్రమం? సోమవారం(ఆగస్టు 31) ఘనంగా నిర్వహించారు. కొణిదెల నాగబాబు, కేఎస్ రవి కుమార్, వీఎన్ ఆదిత్య, మెహర్ రమేష్, సాయి రాజేష్, ఎస్‌కేఎన్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హీరో సందీప్ మాట్లాడుతూ.. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో అందరికీ పరిచయం అయ్యాను. ఈ కొత్త సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన నాగబాబుకి ధన్యవాదాలు. 'వేట' అనేది చిరంజీవి సినిమా టైటిల్. ఇది ఓ గ్రామీణ కథ. ఈ సినిమాని అందరూ సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని తెలిపారు. కాగా ఎస్ఆర్‌డీ ప్రొడక్షన్స్, ఈటీవీ విన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చైతన్ భరద్వాజ సంగీతం అందిస్తున్నారు.




## పిల్లితో మొదలైన మిస్టరీ.. 'హతః' టైటిల్ గ్లింప్స్‌తో ఆసక్తి పెంచిన కిరణ్ అబ్బవరం!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటుడిగానే కాకుండా నిర్మాతగానూ తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఇటీవల దాదాపు 50 మంది కొత్తవాళ్లతో తెరకెక్కిన విలేజ్ డ్రామా 'తిమ్మరాజుపల్లి టీవీ' తో నిర్మాణ రంగంలోకి అడుగుపెట్టిన కిరణ్.. ఇప్పుడు తన బ్యానర్ నుంచి రెండో ప్రాజెక్ట్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సిద్ధమయ్యారు. ఈ కొత్త సినిమాకు 'హతః' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేస్తూ టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను విడుదల చేశారు. 'హతః' టైటిల్ అనౌన్స్‌మెంట్ గ్లింప్స్‌ను మేకర్స్ చాలా విభిన్నంగా రూపొందించారు. వీడియో ప్రారంభంలో ఒక చీకటి వాతావరణం కనిపించగా.. ఆ తర్వాత కెమెరా ఒక డార్క్ బాక్స్ వైపు జూమ్ అవుతుంది. ఆ బాక్స్‌లో ఒక పిల్లి కనిపిస్తుంది. చివర్లో 'హతః' అనే టైటిల్‌ను రివీల్ చేశారు. అయితే అసలు ట్విస్ట్ అక్కడే ఉంది. "×ర్ ష్ట్రవ ఎ్ఫ ఖశ్రీఅజవ శీతీ.." అంటూ మేకర్స్ ఇచ్చిన క్యాప్షన్ సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. పిల్లి బతికే ఉందా? లేదా? అనే ప్రశ్నతోనే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించే ప్రయత్నం చేశారు. సినిమా కథ, జానర్, పాత్రలు వంటి విషయాలను ప్రస్తుతానికి పూర్తిగా రహస్యంగా ఉంచారు. 'హతః' గురించి మేకర్స్ చెబుతున్న మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇప్పటివరకు ప్రేక్షకులు చూడని తరహా కథతో ఈ సినిమా రూపొందుతోందట. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా, కొత్త జానర్‌లో ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. టైటిల్‌తో పాటు గ్లింప్స్, క్యాప్షన్‌లోనూ మిస్టరీని కొనసాగించడంతో అసలు సినిమా ఏ జానర్‌కు చెందింది? కథ ఏంటి? అనే ప్రశ్నలు మొదలయ్యాయి. ముఖ్యంగా ఒక్క పిల్లిని ప్రధానంగా చూపిస్తూ టైటిల్‌ను ప్రకటించడం ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీస్తోంది. 'తిమ్మరాజుపల్లి టీవీ' తర్వాత కిరణ్ అబ్బవరం నిర్మాణంలో వస్తున్న రెండో ప్రాజెక్ట్ ఇది.

# ఒక్క కథ కూడా ఎక్జయిటింగ్‌గా అనిపించలేదు.. రోమాంచకం బ్యూటీ అనంతిక సనిల్ కుమార్



టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో వస్తోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ రోమాంచకం. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా నిర్మిస్తున్నారు. వేణుగోపాల్ రెడ్డి డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో అనంతిక సనిల్ కుమార్, సుమంత్ ప్రభాస్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ మూవీ గురువారం ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా అనంతిక సనిల్ కుమార్ ఆసక్తికర విషయాలు షేర్ చేసుకుంది.

రోమాంచకం సినిమా గురించి మాట్లాడుతూ.. 8 వసంతాలు తర్వాత నేను చాలా కథలు విన్నా. కానీ వాటిలో ఏవీ కూడా ఎక్జయిటింగ్‌గా అనిపించలేదు. అప్పుడే రోమాంచకం స్టోరీ నా దగ్గరకు వచ్చింది. ఇలాంటి స్క్రిప్ట్ కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నా. ఈ సినిమాలో సాదాసీదాగా కనిపించే అమ్మాయిగా నటించా. యూత్‌కు రోమాంచకం కనెక్ట్ అవుతుంది. ఈ సినిమాలో ప్రేమతోపాటు కామెడీ, సస్పెన్స్ ఎలిమెంట్స్ ఉంటాయంది. నేటి యువత జీవితాల్లో చోటుచేసుకుంటున్న సమకాలీన అంశాలను రోమాంచకరం ప్రతిబింబిస్తుంది. మా సినిమాను ఫ్యామిలీ ఆడియెన్స్ కూడా వీక్షించవచ్చు. నాతో పోలిస్తే సుమంత్ ప్రభాస్ ఈ మూవీ కోసం చాలా వర్క్ షాప్స్‌లో పాల్గొన్నారు. ఆయన పాత్ర ఎంతో ఉత్సాహభరితంగా ఉంటుంది. మా మధ్య డైలాగ్స్ చాలా సహజంగా ఎక్కడా సాగదీసినట్టుగా అనిపించకుండా సాగుతాయని చెప్పుకొచ్చింది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com